

మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌శర్మ

గణతంత్ర దినోత్సవం సందర్భంగా అంబేద్కర్ క్రీడా మైదానంలో జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ రాహుల్‌శర్మ, పాల్గొన్న ఎమ్మెల్యే గండ్ర, ఎస్పీ కిరణ్

సమగ్రాభివృద్ధికి నిరంతర కృషి

అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా పథకాల అమలు

- గణతంత్ర దినోత్సవంలో కలెక్టర్ రాహుల్‌శర్మ
- అంబేద్కర్ క్రీడా మైదానంలో ఘనంగా వేడుకలు



భూపాలపల్లిటౌన్/భూపాలపల్లి కృష్ణకాలనీ, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): జిల్లా సమగ్రాభివృద్ధే లక్ష్యంగా నిరంతర కృషి చేస్తున్నామని కలెక్టర్ రాహుల్‌శర్మ అన్నారు. గణతంత్ర వేడుకలు భూపాలపల్లి కృష్ణకాలనీలోని అంబేద్కర్ క్రీడా మైదానంలో ఆదివారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా జాతీయ జెండాను ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణతో కలిసి కలెక్టర్ ఆవిష్కరించారు. అనంతరం ఎస్పీ కిరణ్‌ఖరే ఆధ్వర్యంలో పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రజలను ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడారు. పేదలకు అభివృద్ధి సంక్షేమ పథకాలు అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా, నూతన రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాల లబ్ధిదారుల ఎంపికను పకడ్బందీగా చేపట్టామన్నారు. జిల్లాలోని 37,235 మంది రైతులకు రూ.332.23 కోట్లు రుణమాఫీ చేసినట్లు తెలిపారు. రైతు భరోసా కింద యాసంగిలో 79వేల 544 మంది రైతులకు రూ.79.15కోట్లు చెల్లించామని అన్నారు. ప్రభుత్వమే ప్రీమియం చెల్లిస్తూ రైతుబీమా అమలు చేస్తోందని తెలిపారు. 72వేల 118 మంది రైతులకు రైతు బీమాను వర్తింపజేసినట్లు చెప్పారు. మృతిచెందిన 1363 మంది రైతు కుటుంబాలకు రైతుబీమా ద్వారా రూ.68.15కోట్లు ఆర్థిక సహాయాన్ని అందించినట్లు తెలిపారు. 12 రైతు వేదికల్లో ప్రతి మంగళవారం రైతు నేస్తం కార్యక్రమాలు నిర్వహిస్తూ పంటల సాగుపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. వ్యవసాయంతో పాటు మిగిలిన అన్ని రంగాలకు 24గంటల కరెంటు ఇస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో 42,444 ఉచిత విద్యుత్ వ్యవసాయ కనెక్షన్లు ఉన్నాయని, 200 లోపు విద్యుత్ వినియోగిస్తున్న 54,131 మంది వినియోగదారులకు రూ.12.88కోట్లు బిల్లు ప్రభుత్వమే చెల్లిస్తోందని వివరించారు.

2244 మెట్రిక్ టన్నుల బియ్యం

జిల్లాలోని 277 రేషన్ దుకాణాల ద్వారా 1,23,453 మంది లబ్ధిదారులకు 2244 మెట్రిక్ టన్నుల బియ్యం సరఫరా చేశామని అన్నారు. 62 సంక్షేమ హాస్టళ్ల విద్యార్థులకు ప్రతినెలా 992 క్వింటాళ్లు, 479 పాఠశాలల విద్యార్థులకు మధ్యాహ్న భోజనానికి 452 క్వింటాళ్లు, 644 అంగన్‌వాడీ కేంద్రాలకు 250 క్వింటాళ్లు ఫోర్టిఫైడ్ సన్నబియ్యం ఇస్తున్నామని తెలిపారు. 205 ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుతో 23,548 మంది రైతుల నుంచి 1 లక్ష 7వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి 202 కోట్లు చెల్లించామని తెలిపారు. సన్న వడ్లకు బోనస్ చెల్లిస్తున్నామన్నారు.

మహిళల కోసం...

మహాలక్ష్మి పథకం ద్వారా 67,432 మంది లబ్ధిదారులకు రూ.500కే గ్యాస్ ఇస్తున్నామని, ఇప్పటి వరకు 1,92,057 సిలిండర్లకు రూ.5.33కోట్లు సబ్సిడీ చెల్లించామని తెలిపారు. మహిళా శక్తి కార్యక్రమం ద్వారా మహిళలు వ్యాపారాలు చేసుకునేందుకు అవకాశం కల్పించినట్లు తెలిపారు. ఈ క్రమంలోనే ఐదు మహిళా శక్తి క్యాంటీన్లు ఏర్పాటు చేశామని, రూ.10లక్షల విలువగల ఫిష్ ఫుడ్ ట్రక్కులు మంజూరు చేశామని పేర్కొన్నారు. జిల్లా మహిళా సమాఖ్యలో 85,113 మందికి 364 గ్రామ సంఘాల్లో 8,073 మంది పేర్లు నమోదైనట్లు తెలిపారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద 2023-24 ఆర్థిక సంవత్సరంలో కనీసం 20 రోజుల ఉపాధిహామీ పథకం పనులు చేసిన భూమిలేని వ్యవసాయ కూలీలకు కుటుంబానికి సంవత్సరానికి రూ.12 వేలు అందించేందుకు గ్రామ సభలు నిర్వహించి అర్హుల ఎంపిక చేపట్టామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, ఎస్పీ కిరణ్‌ఖరే, అడిషనల్ ఎస్పీ బోనాల కిషన్, అడిషనల్ కలెక్టర్లు అశోక్‌కుమార్, విజయలక్ష్మి, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్‌సింగ్, ఏఆర్ అడిషనల్ ఎస్పీ శ్రీనివాస్, ఆర్డీవో రవి, తదితరులు పాల్గొన్నారు.



నృత్యంలో ప్రతిభ కనబరిచిన గొల్లబుద్దారం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులతో ఎమ్మెల్యే, కలెక్టర్, ఎస్పీ

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

గణతంత్ర్య వేడుకలను పురస్కరించుకొని అంబేద్కర్ స్టేడియంలో నిర్వహించిన పోలీస్ కవాతు ఎంతగానో ఆకట్టుకుంది. పరేడ్ కమాండర్‌గా హెడ్ క్వార్టర్స్‌లో విధులు నిర్వర్తిస్తున్న ఆర్ఐ ముత్యం వ్యవహరించారు. భూపాలపల్లి జిల్లా కేంద్రానికి చెందిన ఇద్దరు స్వాతంత్ర్య సమరయోదులు పెంచాల రాజయ్య, బుర్ర రాజవీరును కలెక్టర్ రాహుల్ శర్మ, ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, ఎస్పీ కిరణ్ ఖరే ఘనంగా సన్మానించారు. ఈ వేడుకల్లో వివిధ శాఖల ఆధ్వర్యంలో ఐదు స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. వీటిలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఏ), మత్స్యశాఖ ఆధ్వర్యంలో మొబైల్ ఫిష్ యూనిట్, వ్యవసాయ, ఉద్యాన శాఖ సంయుక్తంగా మరో శకటం, రవాణాశాఖ, సింగరేణి ఆధ్వర్యంలో శకటాలు ఏర్పాటు చేశారు. అలాగే వివిధ శాఖల ఆధ్వర్యంలో స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. జిల్లా పౌరసంబంధాల శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్ స్టాల్ వీక్షకులను ఆకట్టుకుంది. వివిధ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థుల సాంస్కృతిక నృత్యాలు ఆహుతులను ఆకట్టుకున్నాయి.



నృత్యాలు చేస్తున్న విద్యార్థినులు



సమరయోధులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే, కలెక్టర్



పరేడ్‌లో పోలీసుల కవాతు

గణతంత్ర వేడుకల్లో ప్రశంసా పత్రాలు అందుకున్న ఉద్యోగులు



కలెక్టర్ రాహుల్‌శర్మ, ఎమ్మెల్యే గండ్ర చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందుకుంటున్న ఏఎస్పీ బోనాల కిషన్

నారాయణరావు, డీపీవో | నరేష్, డీఆర్‌డీఏ పీడీ | రాజేందర్, డీఈవో | చెన్నయ్య, జిల్లా సంక్షేమాధికారి | శ్రీనివాస్, డీపీఆర్వో | మల్హార్‌నాయక్, విద్యుత్ శాఖ ఎస్ఈ | కుమారస్వామి, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి | కృష్ణ డిప్యూటీ, మహదేవపూర్ తహసీల్దార్ | హేమ, చిట్యాల తహసీల్దార్ | రవికుమార్, మల్హర్, తహసీల్దార్



సంపత్‌రావు, భూపాలపల్లి డీఎస్పీ | నరేష్‌కుమార్, భూపాలపల్లి సీఐ | రత్నం, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ | కిరణ్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ | పవన్‌కుమార్, మహదేవ్‌పూర్ ఎస్సై | అశోక్, గణపురం ఎస్సై | రమేష్, పలిమెల ఎస్సై | సమ్మిరెడ్డి, ఏఎస్సై చిట్యాల | నరేష్, హోంగార్డు భూపాలపల్లి | స్వప్నకుమారి, సీసీఎస్ ఉమెన్ ఎస్సై | సదానందం, రిజర్వ్ ఎస్సై | అశోక్, ఆర్టీసీ కానిస్టేబుల్ | రఫీయొద్దీన్, ఆర్టీసీ హెడ్‌కానిస్టేబుల్ | శ్రీనివాస్‌రావు, ఆర్టీవో, డీటీ



ములుగు జిల్లా లింగాపూర్‌లో లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేస్తున్న మంత్రి సీతక్క

పేదరిక నిర్మూలనే ప్రభుత్వ లక్ష్యం

- రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క
- ములుగులో నాలుగు పథకాల ప్రారంభోత్సవం
- లబ్ధిదారులకు మంజూరు పత్రాల పంపిణీ

4

ప్రజల దీవెనలు ప్రభుత్వంపై ఉండాలి

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

చిట్యాల, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వంపై ప్రజల దీవెనలు ఉండాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు కోరారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేస్తున్నామని, ఇచ్చిన మాటకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు. మండలంలోని ముచిని పర్తి గ్రామంలో ఆదివారం ప్రజాపాలన సంక్షేమ పథకాల ప్రారంభోత్సవం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరయ్యారు. 113 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్లు, 1394 మందికి రైతు భరోసా, 54 మందికి నూతన రేషన్ కార్డులు, 11 మందికి ఇందిరమ్మ ఆత్మీయ భరోసా మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన నాలుగు సంక్షేమ పథకాలకు గ్రామంలో ఇంకా అర్హులైన వారు ఎవరైనా ఉంటే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. విచారణ చేపట్టి వెంటనే వారికి కూడా మంజూరు పత్రాలు అందజేస్తామని అన్నారు. రెండు రోజుల్లో రైతుభరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా నిధులు లబ్ధిదారుల ఖాతాల్లో జమ అవుతాయని తెలిపారు. వచ్చే నెల నుంచి కొత్తకార్డులపై రేషన్ బియ్యం పంపిణీ చేస్తామని అన్నారు. రెండు, మూడు రోజుల్లో ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభించుకోవాలని ఇందిరమ్మ లబ్ధిదారులకు సూచించారు. జిల్లా నుంచి ప్రత్యేక అధికారుల బృందం వస్తుందని, పరిశీలించి నాలుగు విడతల్లో రూ. 5 లక్షలు లబ్ధిదారుల ఖాతాల్లో జమ అవుతాయని తెలిపారు. గత ప్రభుత్వం చేసిన అప్పుల భారం రాష్ట్ర ప్రభుత్వంపై ఉన్నా సంక్షేమ పథకాలను నిలిపేయకుండా సమర్థంగా అమలు చేస్తున్నామని అన్నారు. ఈకార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి చిన్నయ్య, ఏఎంసీ చైర్‌పర్సన్ గుమ్మడి శ్రీదేవి, ఎంపీడీవో జయశ్రీ, తహసీల్దార్ హేమ, ఎంపీవో రామకృష్ణ, ఏపీవో అలీం, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గూట్ల తిరుపతి, మాజీ జడ్పీటీసీలు పులి తిరుపతిరెడ్డి, ఓరం సమ్మయ్య, పాపిరెడ్డి, మల్లయ్య, రత్నాకర్‌రెడ్డి, రాయకొంరు, అనీల్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



ముచినిపర్తిలో లబ్ధిదారులకు మంజూరు పత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



పెంబర్తి గ్రామంలో మహిళకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు పత్రాన్ని అందిస్తున్న మంత్రి శ్రీనివాసరెడ్డి

ఇందిరమ్మ ప్రభుత్వంతోనే పేదలకు న్యాయం

- రూ.45వేల కోట్లతో నాలుగు పథకాల అమలు
- ప్రతీ నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇళ్లు
- అర్హులైన ప్రతీ పేద కుటుంబానికి రేషన్‌కార్డు
- వ్యవసాయ యోగ్యమైన భూములకే రైతు భరోసా
- భూమిలేని ప్రతీ పేద కుటుంబానికి ఆత్మీయ రైతు భరోసా
- ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

5



మామునూరు వద్ద అదుపుతప్పిన కంటైనర్ లారీ, స్తంభాలు పడడంతో నుజ్జు నుజ్జు అయిన ఆటో

మృతులు ఆర్తి చౌహాన్, కన్నా చౌహాన్, సంతోష్ చౌహాన్, కిరణ్ చౌహాన్



నలిగిన వలస బతుకులు

కంటైనర్ స్తంభాలు మీదపడి నలుగురి మృత్యువాత

- రెండు ఆటోలపై కంటైనర్‌లోని ఇనుప స్తంభాల బోల్తా
- వరంగల్ - ఖమ్మం జాతీయ రహదారిపై ఘటన
- మృతులంతా మధ్యప్రదేశ్ భోపాల్ వలస కార్మికులు
- కంటైనర్ డ్రైవర్ నిర్లక్ష్యంతో ఘోర ప్రమాదం
- ప్రమాద ఘటనపై సీఎం రేవంత్‌రెడ్డి దిగ్భ్రాంతి
- క్షతగాత్రులను పరామర్శించిన మంత్రి సురేఖ, కలెక్టర్, సీపీ

5

వలస జీవులను మృత్యువు కంటైనర్ లారీ రూపంలో కబళించింది. పొట్టకూటి కోసం రాష్ట్రానికి వచ్చిన వారిపై విధి పగబట్టినట్లు అయింది. బతుకుదెరువు కోసం తాము తయారు చేసిన కత్తులు, ఈలపీటలు అమ్ముకునేందుకు ఆటోలో వెళుతున్న నిరుపేద కుటుంబంపై కంటైనర్‌లోని ఇనుప స్తంభాలు పడడంతో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మృతిచెందారు. స్తంభాల బరువుకు దేహాలు చితికిపోయాయి. ఈ ఘటనలో అదే కుటుంబంలో ఇద్దరు తీవ్రగాయాలతో చికిత్స పొందుతున్నారు. ఈ ఘోర ప్రమాదం వరంగల్ జిల్లా ఖిలా వరంగల్ మండలం మామునూరు పోలీస్‌స్టేషన్ వద్ద ఆదివారం ఉదయం జరిగింది.

- మామునూరు(ఆంధ్రజ్యోతి)



వన దేవతలను దర్శించుకుంటున్న భక్తులు

మేడారంలో మొక్కుల జోరు

20 వేల మందికి పైగా తరలివచ్చిన భక్తులు

తాడ్వాయి, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారంలో భక్తుల మొక్కులు ఆదివారం జోరుగా కొనసాగాయి. మినీ జాతరకు ముందస్తుగా దర్శనాలు చేసుకున్నారు. తెలంగాణ నలుమూలల నుంచే కాకుండా ఛత్తీస్‌గఢ్, ఒడిశా, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర నుంచి భారీ సంఖ్యలో తరలివచ్చారు. సుమారు 20 వేల మంది వనదేవతలను దర్శించుకున్నట్లు దేవాదాయ శాఖ అధికారులు తెలిపారు. తాడ్వాయి ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు భద్రతా చర్యలు చేపట్టారు. వాహనాలను పార్కింగ్‌కు తరలిస్తూ ట్రాఫిక్‌ను నియంత్రించారు. గద్దెల వద్ద రద్దీని నియంత్రిస్తూ దొంగతనాలు జరగకుండా చర్యలు చేపట్టారు. భక్తులకు జిల్లా వైద్యాధికారి ఆదేశాల మేరకు మేడారంలో వైద్య సిబ్బంది శిబిరాన్ని ఏర్పాటు చేశారు. డాక్టర్ చిరంజీవి ఆధ్వర్యంలో వైద్య సేవలందించారు. ఈ వైద్య సేవల్లో డాక్టర్ శ్రీజ, డీపీఎంవో సంజీవరావు, ఎంపిహెచ్ఎస్ సరస్వతి, స్టాఫ్‌నర్స్ మమత, ఏఎన్ఎం, ఆశాలు పాల్గొన్నారు. 70 మంది పారిశుధ్య కార్మికులు మేడారంలో విధులు నిర్వర్తించారు. కార్యదర్శి సతీష్ ఆధ్వర్యంలో పనులు సాగుతున్నాయి.

పేదరిక నిర్మూలనే ప్రభుత్వ లక్ష్యం

- రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క
- ములుగు మండలం జీవంతరావుపల్లిలో నాలుగు పథకాల ప్రారంభోత్సవం

ములుగు, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): పేదరిక నిర్మూలనే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన నూతన రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలను ములుగు మండలం జీవంతరావుపల్లిలో ఆదివారం మధ్యాహ్నం లాంఛనంగా ప్రారంభించారు. లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అర్హులందరికీ పథకాలు వర్తిస్తాయని, ఎవరూ ఆందోళన చెందొద్దని అన్నారు. జాబితాలో పేరు లేకుంటే సంయమనం పాటించాలని, అధికారులను సంప్రదిస్తే అర్హతనుబట్టి పథకాలను అందజేస్తారని చెప్పారు. ఇచ్చిన మాటను లబెట్టుకుంటూ ప్రజాప్రభుత్వం పథకాలను అమలు చేస్తోందన్నారు. అధికారం కోల్పోవడంతో బీఆర్ఎస్ పల్లెల్లో డ్రామాలాడుతోందని విమర్శించారు. సంక్షేమ పథకాలను విచ్ఛిన్నం చేసేందుకు కుట్ర చేస్తోందన్నారు. కొందరిని ఉద్దేశపూర్వకంగానే రెచ్చగొట్టి అర్హులకు పథకాలు రాకుండా అడ్డుకుంటున్నారన్నారు. దీంతో గందరగోళ పరిస్థితులు ఎదురై లబ్ధిదారుల ఎంపిక ఆలస్యమవుతోందని తెలిపారు. ఎవరెన్ని కుట్రలు చేసినా ప్రజాప్రభుత్వం సంక్షేమ పాలనను విజయవంతంగా కొనసాగిస్తుందన్నారు. వెంకటాపూర్ మండలం లింగాపూర్, గోవిందరావుపేట మండలం రాఘవపట్నం, తాడ్వాయి మండలం అంకంపల్లి గ్రామాల్లో లబ్ధిదారులు నాలుగు పథకాల ప్రొసీడింగ్‌లను సీతక్క అందజేశారు. ఈ కార్యక్రమాల్లో కలెక్టర్ టీఎస్.దివాకర, గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.





మంజూరు పత్రాలను అందజేస్తున్న మంత్రి సీతక్క, క్యాంపు కార్యాలయంలో జాతీయ జెండాకు వందనం చేస్తున్న మంత్రి

ఉపకరణాల పంపిణీ

సామాజిక అధికారితా శివిర్ కార్యక్రమంలో భాగంగా అలింకో సంస్థ సహకారంతో 467 మంది దివ్యాంగులకు సమకూర్చిన 857 రకాల సహాయ ఉపకరణాలను మంత్రి సీతక్క పంపిణీ చేశారు. ములుగులోని గిరిజన భవన్‌లో ఈ కార్యక్రమం జరిగింది. కలెక్టర్ దివాకర, అలింకో సంస్థ ప్రతినిధి శివసాయి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవిచందర్, జిల్లా సంక్షేమాధికారి శిరీష, డీఎస్పీ రవీందర్, దివ్యాంగుల సంక్షేమ సంఘం నాయకుడు పెద్దబోయిన శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రగతియే ప్రధాన ఎజెండా

తెలంగాణ ప్రగతియే ఏకైక ఎజెండాగా సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం పని చేస్తోందని మంత్రి సీతక్క అన్నారు. 76వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా ములుగులోని క్యాంపు కార్యాలయ ఆవరణలో జాతీయ జెండాను ఆవిష్కరించారు. మహాత్మాగాంధీ, అంబేద్కర్ విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలకు ప్రాధాన్యం ఇస్తూ జయజయహే తెలంగాణ గీతాన్ని రాష్ట్ర గీతంగా ప్రకటించుకున్నామన్నారు. ప్రభుత్వం ఏర్పాటైన నాటి నుంచి ఇప్పటి వరకు 50వేల ఉద్యోగాలను భర్తీ చేశామన్నారు.

సన్న వడ్లకు రూ.500 బోనస్ ఇస్తున్న ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్సేనన్నారు. యువతకు వృత్తినైపుణ్య శిక్షణ ఇస్తూ ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. రైతు భరోసా కింద ఎకరానికి రూ.12వేలు, నిరుపేద కూలీలకు రూ.12వేల ఆత్మీయ భరోసానిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు పైడాకుల అశోక్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షుడు గొల్లపల్లి రాజేందర్ గౌడ్, బీసీ సెల్ అధ్యక్షుడు వంగ రవియాదవ్, కాంగ్రెస్ టౌన్ అధ్యక్షుడు చింత నిప్పుల భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.



సంద్రాలగూడెంలో లబ్ధిదారురాలికి మంజూరు పత్రాన్ని అందజేస్తున్న జడ్పీ సీఈఓ పురుషోత్తం

పథకాల వర్షం.. లబ్ధిదారుల హర్షం

- పదేళ్లుగా ఎదురుచూపులు
- కల నిజమైందని ఆనందం
- మానుకోటలో అట్టహాసంగా నాలుగు పథకాల ప్రారంభం

మహబూబాబాద్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి) : పదేళ్లుగా రేషన్‌కార్డు, ఇళ్ల పథకాలకు దూరమైన ప్రజలకు కాంగ్రెస్ సర్కారు అమలు చేస్తున్న నాలుగు నూతన పథకాలతో ఒక్కసారిగా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వం ప్రతిష్మాత్మకంగా అమలు చేస్తున్న రైతు పంటలకు పెట్టుబడి అందించే రైతు భరోసా, భూమిలేని రైతుకూలీలకు ఆర్థిక సాయం అందించే ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, పేదలకు రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల పథకాలను మహబూబాబాద్ జిల్లాలోని 18 మండలాల్లో లాంఛనంగా ఒక్కో గ్రామం చొప్పున ఆదివారం ప్రారంభించారు. కొన్ని గ్రామాల్లో మధ్యాహ్నం ఒంటిగంటకు పథకాల ప్రారంభోత్సవ సభలు నిర్వహించగా మరికొన్ని గ్రామాల్లో సాయంత్రం నిర్వహించారు. జిల్లాలోని అన్ని గ్రామాల్లో ఈనెల 21వ తేదీ నుంచి 24 వరకు గ్రామసభలను నిర్వహించి నాలుగు పథకాలకు దరఖాస్తులను స్వీకరించారు. దరఖాస్తుదారుల్లో ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల ప్రకారం లబ్ధిదారులను ఎంపిక చేశారు. తొలిదశలో వివిధ మండలాల్లో 86 నుంచి 367 ఇళ్లు ఉన్న చిన్నగ్రామపంచాయతీలను ప్రయోగాత్మకంగా అధికారులు ఎంచుకొని పథకాల అమలును చేపట్టారు. జిల్లాలో మొదటి దశలో 6700 మంది రైతులకు రైతుభరోసా, 467 మందికి ఇందిరమ్మ ఆత్మీయభరోసా, 890 మందికి రేషన్‌కార్డులు, 1,488 మందికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి, ఆయా శాఖల మంత్రుల ఫొటోలు, పేర్లతోపాటు జిల్లా కలెక్టర్ పేరిట ఉత్తర్వుల మంజూరు లేఖలను లబ్ధిదారులకు అందజేశారు.

ఆరేళ్లుగా రేషన్‌కార్డు కోసం ఎదురుచూస్తున్నా..



నాకు 2019లో వివాహం కాగా అప్పటి నుంచి కొత్త రేషన్‌కార్డుకు కోసం పలుమార్లు దరఖాస్తు చేసుకున్నప్పటికీ రేషన్‌కార్డు రాలేదు. దీంతో ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు అందలేదు. ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు గ్రామంలోనే గ్రామసభలను నిర్వహించి అర్హులైన లబ్ధిదారులకు గుర్తించి ప్రభుత్వం రేషన్‌కార్డులను అందజేయడం సంతోషంగా ఉంది.

బానోత్ ప్రవీణ్, పెద్దవంగర మండలం, పోచారం రేఖ్యాతండా

కూలీలకు ఆర్థిక భరోసా ఇచ్చే పథకం



నాలాంటి నిరుపేద భూమిలేని కూలీలకు ఆర్థికంగా ఈ పథకం ఎంతో చేయూతనిస్తుంది. సొంత భూమి ఉన్నవారికి రైతుభరోసా వస్తోందని, బాధపడేదాన్ని మాలాంటి వారికి ఒక పథకం పెడితే బాగుండని అనిపించేది. కాంగ్రెస్ ప్రభుత్వం ఇలాంటి పథకం అమలు చేయడం కూలీలకు ఎంతో సంతోషకరమైన విషయం. ఆత్మీయ భరోసా ఇస్తున్నందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి సీతక్కకు ధన్యవాదాలు.

బాదావత్ తార, ఆత్మీయభరోసా లబ్దిదారురాలు, గాంధీనగర్

గతంలో కంటే ఎక్కువ రావడం సంతోషంగా ఉంది



గత ప్రభుత్వం కంటే రైతుభరోసాను పెంచి ఇవ్వడం సంతోషంగా ఉంది. ప్రస్తుత యాసంగి సీజన్ పెట్టుబడులకు ఈ పైకం ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. ఈ పథకాన్ని ఇలాగే కొనసాగించి రాబోయే రోజుల్లో ఎన్నికల్లో హామీ ఇచ్చినట్లుగా రూ.15వేల పెంచుతామని సభలో ప్రకటించడం హర్షనీయం. అన్ని పథకాలు దశల వారీగా అమలు చేస్తారని కాంగ్రెస్ ప్రభుత్వంపై నమ్మకం ఏర్పడింది.

బచ్చలి సోమయ్య, రైతు భరోసా లబ్దిదారు, ఖానాపురం

సొంత ఇంటి కల నెరవేరబోతోంది



ఇందిరమ్మ ఇల్లు మంజూరుతో సొంత ఇంటి కల నెరవేరబోతున్నందుకు సంతోషంగా ఉంది. గత పదేళ్లలో ఇళ్ల పథకంలో దరఖాస్తు చేసుకున్నప్పటికీ మంజూరు కాలేదు. ఇందిరమ్మ ఇళ్ల పథకంలో రూ.5 లక్షలు మంజూరుకావడం పేదలకు ఎంతో చేయూతనిస్తుంది. ఎన్నో ఏళ్లుగా సొంత ఇంటిని నిర్మించుకోవాలనే కోరిక కాంగ్రెస్ ప్రభుత్వంలో తీరుతోంది.

పూనెం ప్రశాంత్, ఇందిరమ్మ ఇల్లు లబ్దిదారుడు, బయ్యారం మండలం, నామాలపాడు

కాళేశ్వరాలయ ఈవోపై వేటు

- ప్రైవేటు ఆల్బమ్ చిత్రీకరణపై ప్రభుత్వం సీరియస్
- విధుల నుంచి తొలగింపు
- మరో ఇద్దరికి మెమోలు

మహదేవపూర్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి : జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని పవిత్ర పుణ్యక్షేత్రమైన కాళేశ్వర ముక్తీశ్వరస్వామి గర్భాలయంలో తలపులు మూసేసి సినీ గాయని మధుప్రియ ప్రైవేటు ఆల్బమ్ చిత్రీకరించిన ఘటనను రాష్ట్ర ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది. ఇన్‌చార్జి ఈవో మారుతిపై వేటు వేశారు. కాళేశ్వరం ఆలయ విధులను నుంచి ఆయన్ను తొలగిస్తూ దేవాదాయ శాఖ కమిషనర్ శ్రీధర్ శనివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. ఓ పూజారితోపాటు, జూనియర్ అసిస్టెంట్‌కు మెమోలు జారీ చేశారు. గర్భాలయంలో ప్రైవేటు ఆల్బమ్ చిత్రీకరించిన గాయని మధుప్రియకు నోటీసు జారీ చేశారు. రేగొండ ఆలయ ఈవోగా ఉన్న మహేష్‌ను కాళేశ్వరం ఈవోగా నియమించారు. గతంలో కూడా మహేష్ కాళేశ్వర ముక్తీశ్వరాలయ పనిచేశారు. కొన్ని ఆరోపణల నేపథ్యంలో ఆయన్ను కోటంచ ఆలయానికి బదిలీ చేశారు. మళ్లీ ఆయన్నే మారుతి స్థానంలో నియమించడం చర్చనీయాంశమైంది.

వివాదాస్పదంగా మారిన వీడియో చిత్రీకరణ

కాళేశ్వర ఆలయంలో ప్రైవేటు ఆల్బమ్ చిత్రీకరణ కలకలం రేపింది. ఆరు రోజులుగా ఇది చర్చనీయాంశమవుతోంది. ఆలయ తలుపులు మూసి గర్భగుడిలో షూటింగ్ చేయడం వివాదాస్పదంగా మారింది. షూటింగ్‌కు సంబంధించిన వీడియోలు వైరల్ అయ్యాయి. ఇలా ఆలయంలో డ్యాన్సులు వేస్తూ వీడియో చిత్రీకరణ చేయడం అపచారమని, దీనిపై చర్య తీసుకోవాలని భక్తుల నుంచి డిమాండ్ వచ్చింది. బీజేపీ, దళిత సంఘాలు ఆందోళనలకు దిగాయి. ఈ నేపథ్యంలో దేవాదాయ శాఖ కమిషనర్ స్పందించారు. దీనిపై వివరణ ఇవ్వాలని ఈవోకు ఆదేశాలు జారీ చేశారు. ఈ ఘటనపై విచారణ అనంతరం ఈవోపై వేటు వేస్తూ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు.

ఆలయంలో చోరీ

డోర్నకల్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి) : డోర్నకల్ మండలం ఉయ్యాలవాడ గ్రామంలోని శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో శనివారం గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. ఆలయ ధర్మకర్త నున్న రమణ తెలిపిన వివరాల ప్రకారం.. సీతారామచంద్రస్వామి ఆలయంలోని 90 తులాల వెండి, 2.5 తులాల బంగారు ఆభరణాలు చోరీకి గురైనట్లు చెప్పారు. ఈ విషయమై డోర్నకల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు.

రహదారి భద్రతపై అవగాహన

మట్టెవాడ జనవరి 26 (ఆంధ్రజ్యోతి): రోడ్డు భద్రత మాసోత్సవాలను పురస్కరించుకుని వరంగల్ ములుగు రోడ్డులోని నాగార్జున హోండా షోరూమ్ ఆధ్వర్యంలో ఆదివారం రహదారి భద్రతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా షోరూం సిబ్బంది, మేనేజర్‌లు ఎంజీఎం సర్కిల్ వరకు హెల్మెట్ ధరించి వాహన ర్యాలీ నిర్వహించారు. హెల్మెట్ ధరించిన ద్విచక్ర వాహనదారులకు బహుమతులను అందచేశారు ఈ సందర్భంగానాగార్జున హోండా షోరూం మేనేజర్ సిద్ధార్థ మాట్లాడుతూ.. వాహన చోదకులు రహదారి భద్రత నియామలను పాటించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో షోరూం మేనేజర్ సిద్ధార్థ, దిలీప్, సిబ్బంది పాల్గొన్నారు.



రహదారి భద్రతపై అవగాహన కల్పిస్తున్న నాగార్జున హోండా షోరూం సిబ్బంది

జాతీయ స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో గురునాథరావు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి) : పాండిచ్చేరిలో ఈ నెల 21వ తేదీ నుంచి 25 వరకు నిర్వహించిన జాతీయ స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి మానుకోటకు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు, సైన్స్ కమ్యూనికేటర్ డాక్టర్ వి.గురునాథరావు పాల్గొన్నారు. విశ్వేశ్వరయ్య ఇండస్ట్రియల్ అండ్ టెక్నాలాజికల్ మ్యూజియం బెంగుళూరు, పుదుచ్చేరి ప్రభుత్వ విద్యాశాఖ సంయుక్తంగా నిర్వహించిన జాతీయస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో బ్లూటూత్ కంట్రోల్ కంట్రోల్ రోబోట్ ఫిజిక్స్ ప్రదర్శనను ప్రదర్శించారు. ఈ ప్రదర్శనను తిలకించిన పలువురు విద్యావేత్తలు, అధికారులు భౌతికశాస్త్రం మరియు పునరుత్పత్తి శక్తి అంశాలను విద్యార్థులకు సమర్థంగా, ఆసక్తిగా బోధించే ఒక వినూత్న బోధనోపకరణంగా రూపొందించబడిందని నిర్వాహకులు తెలిపారు. ఈ ప్రాజెక్టు శాస్త్ర విజ్ఞానం మరియు సాంకేతికతను సమన్వయ పరుస్తూ విద్యార్థులకు సుస్థిర అభివృద్ధికి అవసరమైన విజ్ఞానాన్ని అందించే ఒక వినూత్న ప్రయోగంగా ఈ ప్రదర్శనను ప్రశంసించారు. అనంతరం డాక్టర్ గురునాథరావుకు నిర్వాహకులు ప్రశంసాపత్రం, జ్ఞాపికను అందజేసి ఘనంగా సన్మానించారు. గురునాథరావు ప్రస్తుతం కేసముద్రం మండలం పెనుగొండ ప్రభుత్వ పాఠశాలలో భౌతిక రసాయన శాస్త్ర టీచర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. జాతీయస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో ఉమ్మడి వరంగల్ జిల్లా నుండి పాల్గొన్న గురునాథరావును జిల్లా విద్యాశాఖాధికారి రవీందర్‌రెడ్డి, హెచ్ఎం యాదగిరి అభినందించారు.



పాండిచ్చేరిలో వైజ్ఞానిక ప్రదర్శనలో ఎగ్జిబిట్ గురించి వివరిస్తున్న గురునాథరావు

మునిసిపాలిటీ అభివృద్ధికి కృషి చేస్తాం

పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

తొర్రూరు, జనవరి 26 (ఆంధ్రజ్యోతి) : తొర్రూరు మునిసిపాలిటీ అభివృద్ధికి అన్ని విధాల కృషి చేస్తానని ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి అన్నారు. తొర్రూరు మునిసిపల్ పాలకవర్గ ఆత్మీయ వీడ్కోలు సమావేశానికి ఆమె హాజరై మాట్లాడారు. పాలకవర్గ సభ్యులు మునిసిపాలిటీ అభివృద్ధికి చేసిన కృషి అభినందనీయమన్నారు. వారు బాధ్యతల నుంచి విరమించినా పట్టణ అభివృద్ధికి అందుబాటులో ఉండాలన్నారు. తొర్రూరు మునిసిపాలిటీలో వచ్చే నాలుగేళ్లలో మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టాలన్నారు. పాలకవర్గ సభ్యులను శాలువా, మెమెంటోలతో సత్కరించారు. ఎమ్మెల్యేను కౌన్సిలర్లు సత్కరించారు. మునిసిపల్ చైర్మన్ రాంచంద్రయ్య, వైస్ చైర్మన్ సురేందర్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుపతి రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ కాకిరాల హరిప్రసాద్, ఎన్ఆర్ఐ రాజేందర్ రెడ్డి, కమిషనర్ శాంతి కుమార్, కౌన్సిలర్లు, మేనేజర్ కట్ట స్వామి తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల అభ్యున్నతే ఐటీడీఏ ధ్యేయం

- మినీ మేడారం జాతరకు అన్ని ఏర్పాట్లు
- మెరుగైన వైద్య సేవలందిస్తున్నాం
- గణతంత్ర వేడుకల్లో పీవో చిత్రామిశ్రా

ఏటూరునాగారం రూరల్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): గిరిజనులకు అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అందించి, వారి అభ్యున్నతే ధ్యేయంగా ఐటీడీఏ పని చేస్తోందని పీవో చిత్రామిశ్రా అన్నారు. మండల కేంద్రంలోని ఐటీడీఏ కార్యాలయంలో గణతంత్ర వేడుకలు ఆదివారం ఘనంగా జరి గాయి. ఈ సందర్భంగా జాతీయ జెండాను పీవో ఆవిష్కరించారు. పోలీ సుల గౌరవ వందనం స్వీకరించిన అనంతరం గిరిజనులను ఉద్దేశించి మాట్లాడారు. మేడారంలో త్వరలో జరగనున్న మినీ మేడారం జాతరకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగ కుండా ఏర్పాట్లన్నీ చేస్తున్నామని తెలిపారు. మేడారంలో రూ. 5.33 కోట్లతో 69 అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు.

గిరిజన విద్య, మెరుగైన ఉపాధి

ఐటీడీఏ పరిధిలో మొత్తం 12,666 మంది గిరిజన విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారని, వారికి మౌలిక సౌకర్యాలు కల్పిస్తున్నామని పీవో అన్నారు. 2024-25 విద్యా సంవత్సరానికి బెస్ట్ అవెలబుల్ స్కీం ద్వారా 290 మంది గిరిజన విద్యార్థులకు కార్పొరేట్ విద్యను అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎస్టీ గురుకులాల్లో 12,815 మంది విద్యార్థులు చదువుకుంటున్నారని, వారికి ఐటీడీఏ ద్వారా సహాయ, సహకారాలు అందిస్తున్నామని తెలిపారు. గిరిజన సంక్షేమ ఆశ్రమ ఆశ్రమ పాఠశాలలు, గురుకుల పాఠశాలల్లో సన్న బియ్యాన్ని అందిస్తూ గిరిజన విద్యార్థులకు పౌష్టికాహారాన్ని అందిస్తున్నమని తెలిపారు. నిరు ద్యోగ యువతకు ఉపాధి అవకాశాలను మెరుగు పర్చేందుకు ఐటీడీఏ ప్రత్యేక చర్యలు చేపడు తు న్నామన్నారు. గతేడాదిలో 323 మంది గిరిజన నిరుద్యోగ యువతకు శిక్షణ నిచ్చి వారికి ఉపాధి అవకాశాలను కల్పించినట్లు పీవో తెలిపారు. గిరిజన మహిళలకు జ్యూట్ బ్యాగుల తయారీలో శిక్షణనిస్తున్నట్లు పీవో పేర్కొన్నారు.

మెరుగైన వైద్యసేవలు

ఐటీడీఏ పరిధిలోని గిరిజనులకు మెరుగైన వైద్య సేవలను అందిస్తున్నామని పీవో తెలిపారు. సుదూర సమస్యాత్మక గ్రామాల్లో వైద్య సేవలు అందించడానికి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో 10 బైక్ అంబులెన్స్‌లను అందుబాటులో ఉంచామని తెలిపారు. ఏటూరునాగారం సామాజిక వైద్యశాలల్లో నూతన వైద్య పరికరాలను రూ. 15లక్షలతో వైద్య పరికరాలను సమకూర్చామన్నారు. రూ. 10లక్షల వ్యయంతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మరమత్తు పనులను చేస్తున్నట్లు తెలిపారు.

అభివృద్ధి పనుల వేగవంతం



ఐటీడీఏలో జరిగిన గణతంత్ర వేడుకల్లో మాట్లాడుతున్న పీవో చిత్రామిశ్రా

ఐటీడీఏ పరిధిలోని అన్ని గ్రామాల్లో అభివృద్ధి పనులను వేగవంతం చేశామని పీవో తెలిపారు. ఆర్టికల్ 275(ఐ) పథకం ద్వారా రూ 160లక్షలతో 10 పనులను మంజూరు చేశామని పీవో తెలిపారు. ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఐటీడీఏ గ్రాంట్ ద్వారా గిరిజన భవనాలు, ఎన్ఆర్‌హెచ్ఎం, బీటీ రోడ్లు, స్కూల్స్, వసతి గృహాల్లో రూ. 528.44కోట్లతో 1219 పనులను మంజూరు చేశామని తెలిపారు. నేషనల్ హెల్త్ మిషన్‌పథకం కింద 44 సబ్‌సెంటర్ల బిల్డింగ్ పనులను రూ. 704లక్షలతో చేపడుతున్నామని పీవో తెలిపారు. ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలో బర్త్ వెయింటింగ్ హాల్స్ 8 ని రూ. 112 లక్షలతో మంజూరు చేశామని, ఇందులో 2 హాల్స్‌ను ఇప్పటికే పూర్తి చేశామని, మరో 6 హాల్స్ పనులను ప్రగతిలో ఉన్నట్లు పీవో తెలిపారు.

ట్రైబల్ రిలీఫ్ ఫండ్ ద్వారా ఆర్థిక సాయం

ట్రైబల్ రిలీఫ్ ఫండ్ ద్వారా నిరుపేద గిరిజనులకు ఆర్థిక సాయమందిస్తున్నామని పీవో తెలిపారు. గతేడాది 59 మంది గిరిజనులకు రూ. 13. 30లక్షల ఆర్థిక సహాయాన్ని అందించామన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో 2020-21, 2021-22 ఆర్థిక సంవత్సరాల్లో మంజూరైన ఎకానమిల్ సపోర్ట్ స్కీం ద్వారా 3911 యూనిట్లు మంజూరు చేసి 3409.78 లక్షల సబ్సిడీని విడుదల చేశామని తెలిపారు. 956 యూనిట్లకు రూ. 866.20 లక్షల సబ్సిడీని విడుదల చేసినట్లు పీవో తెలిపారు. ఇప్పటి వరకు 224 యూనిట్లకు గ్రౌండింగ్ చేసి రూ. 204.63 లక్షలను గిరిజనులకు అందజేసినట్లు పీవో తెలిపారు. గిరిజనులకు విద్య, వైద్య, ఉపాధి అవకాశాలను కల్పించి వారు అన్ని విధాలుగా అభివృద్ధి చెందడమే లక్ష్యంతో ఐటీడీఏ పనిచేస్తోందని పీవో తెలిపారు. ఈ కార్యక్రమంలో డీడీ పోచం, ఏవో రాజ్‌కుమార్, సెక్టోరియల్ అధికారులు పాల్గొన్నారు.



క్యాతంపల్లిలో పథకాల మంజూరు పత్రాలను పంపిణీ చేస్తున్న మంత్రి శ్రీనివాసరెడ్డి, ఎంపీ, ఎమ్మెల్యే

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- క్యాతంపల్లి గ్రామంలో లబ్ధిదారులకు పథకాల పంపిణీ

ధర్మసాగర్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ రాజ్యంలో అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి సంక్షేమ పథకాలను మంజూరు చేస్తామని రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ధర్మసాగర్ మండలం క్యాతంపల్లి గ్రామంలో ఆదివారం ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఎంపీ కడియం కావ్యతో కలిసి ఇందిరమ్మ ఇండ్లు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్‌కార్డులు పథకాలను వారు ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఇందిరమ్మ రాజ్యం వచ్చి ఏడాది గడిచి రెండో ఏడులోకి అడుగు పెడుతున్నామన్నారు.

ఈ క్రమంలో పేదలు, రైతుల గుండెల్లో ఇందిరమ్మ బొమ్మ ఉండేలా ప్రజల కోరికలు తీర్చేలా పథకాలు ఉంటాయని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 606 మండలాల్లో మండలానికో గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టుగా తీసుకుంటామన్నారు. క్యాతంపల్లిలో నాలుగు సంక్షేమ పథకాలు అధికారికంగా ప్రారంభించినట్లు మంత్రి తెలిపారు. రూ.21వేల కోట్లతో 2.60 లక్షల మంది రైతులకు రుణమాఫీ చేసి వారి ఖాతాలో జమచేసినట్లు తెలిపారు. గత ఏడాది నుంచి ప్రతీ ఇంటికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.500లకే గ్యాస్ సిలిండర్, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం ప్రభుత్వం అమలు చేసిందని కొనియాడారు. గత ప్రభుత్వం రైతులకు ఎకరానికి రూ.10వేలు ఇస్తే కాంగ్రెస్ ప్రభుత్వం రూ.12వేలు అమలు చేసిందన్నారు. 2004. నుంచి 2014వరకు అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణలో 25 లక్షల ఇందిరమ్మ ఇళ్లను ఇచ్చిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మొదటి విడతగా రాష్ట్ర వాప్తంగా 4.50లక్షల ఇండ్లను ఇవ్వాలని నిర్ణయిందన్నారు. స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గంలో 3500 ఇళ్ల కంటే అదనంగా ఇచ్చేలా కృషి చేస్తామన్నారు.

స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ.. గ్రామంలోని 713మందికి రైతు భరోసా ఇస్తున్నామని, 43 మంది భూమి లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా ఇస్తున్నామన్నారు. 207మందికి కొత్త రేషన్‌కార్డులను ఇవ్వబోతున్నామని తెలిపారు.

355 మందికి ఇందిరమ్మ ఇళ్లను ఇస్తున్నామని తెలిపారు. గ్రామ సభ ద్వారా సుమారు 1300మంది లబ్ధిదారులకు నాలుగు పథకాల ద్వారా లబ్ధి జరుగనుందన్నారు. రాష్ట్రం 7లక్షల కోట అప్పులో ఉందన్నారు. ప్రతీనెల అప్పుతో పాటు మిత్తీ కడుతున్నామని, మిగిలిన డబ్బులు సర్దుబాటు చేసుకుని పేద ప్రజల సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోందన్నారు. వరంగల్ ఎంపీ కావ్య మాట్లాడుతూ.. వరంగల్‌ను రెండో రాజధానిగా మార్చి అభివృద్ధి చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చిన మాటను గుర్తు చేశారు. ప్రభుత్వం ఏడాది కాలంలో 55 వేల ఉద్యోగాలు ఇవ్వడమే కాకుండా వరంగల్ అభివృద్ధి కోసం రూ.6వేల కోట్లను మంజూరు చేశారన్నారు. స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గానికి రూ.750కోట్ల నిధులు ఇచ్చినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో అయిల్ ఫెడ్ స్టేట్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి, చీఫ్ సెక్రెటరీ రామకృష్ణారావు, జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, ఎంపీడీవో అనిల్, సదానందం తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ప్రభుత్వంతోనే పేదలకు న్యాయం



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి, చిత్రంలో ప్రజాప్రతినిధులు, అధికారులు

- రూ.45వేల కోట్లతో నాలుగు పథకాల అమలు
- ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీనివాసరెడ్డి
- పెంబర్తిలో నాలుగు పథకాల ప్రారంభోత్సవం

హసన్‌పర్తి, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ప్రభుత్వంతోనే పేదలకు న్యాయం జరుగుతుందని ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. హసన్‌పర్తి మండలంలోని పెంబర్తిలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డుల జారీ వంటి సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమం ఆదివారం అధికారికగా ప్రారంభించారు. స్థానిక ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రెవెన్యూ గృహ నిర్మాణాల సమాచార శాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, గౌరవ అతిథులుగా అటవీ, పర్యావరణ, దేవాదాయ, ధర్మాదాయ శాఖల మంత్రి కొండా సురేఖ, ఎంపీ కడియం కావ్య, హనుమకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ ప్రావీణ్య హాజరై లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేశారు.

ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లలో ప్రజలను, పాలనను పూర్తిగా మరిచిపోయి కేవలం వాళ్ల సొంత సంపాదనే లక్ష్యంగా పెట్టుకుందన్నారు. గ్రామాల్లో ఒక రేషన్ కార్డు కావాలా? ఒక ఇల్లు కావాలా? అని ఇప్పుడు కూడా ప్రజల దగ్గరకు వచ్చిన పాపాన పోలేదన్నారు. కాంగ్రెస్ అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలు ఎన్నికల ముందు తెలంగాణకు వచ్చి ఏవైతే హామీలు ఇచ్చి ఆరు పథకాలు అమలు చేస్తామని చెప్పారో.. వాటిని అమలు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డితో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి నాలుగు పథకాల అమలుకు దిశానిర్దేశం చేశారని చెప్పారు. అర్హులైన ప్రతీ పేదవాడికి ఇందిరమ్మ ఇండ్లే సీఎం రేవంత్‌రెడ్డి లక్ష్యమన్నారు. ప్రతీ నియోజకవర్గానికి 3,500 ఇండ్లు, ఆత్మీయ భరోసా కింద ప్రతీ పేద కుటుంబానికి యేటా రూ.12వేలు, రైతు భరోసా కింద రెండు విడతలుగా రూ.12వేలు, అర్హులైన పేదవాడికి తెల్ల రేషన్‌కార్డులు అందజేస్తామన్నారు.

ఇప్పటికే ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత కరెంటు, రూ.500లకే గ్యాస్, వరి పండించే రైతులకు మద్దతు ధర రూ. 2320తో పాటు సన్న వడ్లకు బోనస్ రూ.500లు చెల్లిస్తున్న ఘనత ఇందిరమ్మ ప్రభుత్వానిదే నన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు డిక్లరేషన్‌లో రూ.2లక్షల వరకు రుణమాఫీ చేస్తామని చెప్పి రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగాలేకపోయినా 25,600 మంది రైతులకు రూ.21వేల కోట్ల రుణమాఫీ చేసిందన్నారు. ప్రభుత్వం ఇప్పుడు ప్రవేశపెట్టి అమలు చేస్తున్న నాలుగు పథకాలకు రూ.45వేల కోట్లు ఖర్చు అవుతుందని తెలిసీ కష్టమైనా ప్రజలకు ఇచ్చిన మాటకు కట్టుబడి ఉన్నామన్నారు.

దేశానికి రోల్‌మాడల్

ఇందిరమ్మ రాజ్యమంటేనే దేశానికి రోల్‌మోడల్ అని కొండా సురేఖ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాటల ప్రభుత్వం కాదని మరోసారి నిరూపిస్తూ నాలుగు పథకాలను అమలుకు శ్రీకారం చుట్టామన్నారు. అర్హులైన ప్రతీ ఒక్కరికి పథకాలు అందేలా ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించిందన్నారు. ఎంత లోటు ఉన్నా ప్రజలకు ఇచ్చిన మాటకు కట్టుబడి హామీలను నెరవేర్చే బాధ్యతను కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకుందన్నారు. ఇప్పటికే 56వేల ఉద్యోగాలు ఇచ్చి నిరుద్యోగులకు అండగా నిలిచామన్నారు. ఎంపీ కడియం కావ్య మాట్లాడుతూ.. ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యంగా ముందుకు సాగుతుందన్నారు. అనర్హులైన వారు సంక్షేమ పథకాలు పొందితే తప్పకుండా ప్రభుత్వం వారి పథకాలను రద్దు చేస్తుందన్నారు. ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు మాట్లాడుతూ.. వర్ధన్నపేట నియోజకవర్గంలో పంచాయతీ గ్రామాలతో విలీన గ్రామాలున్నాయని, అందులో ఎస్సీ, ఎస్టీ వర్గాల ప్రజలే అధికంగా ఉన్నారన్నారు. వర్ధన్నపేట నియోజకవర్గానికి అదనంగా 1500 ఇండ్లు కేటాయించాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని అభ్యర్థించారు. అంతేకాకుండా ఈ నియోజకవర్గానికి అదనంగా నిధులు కూడా మంజూరు చేయాలని కోరారు. ప్రజా ప్రభుత్వం రాష్ట్రంలోని పేదలను, రైతులను కాపాడుకుంటోందన్నారు. రాష్ట్రంలోని అన్ని గ్రామాలలో అర్హులైన ప్రతీ పేదవాడికి ఇందిరమ్మ ఇండ్లు అందేవిధంగా ప్రభుత్వం పని చేస్తుందన్నారు. ఎప్పుడు దరఖాస్తు చేస్తే అప్పుడే ప్రతీ ఒక్కరికి సంక్షేమ పథకాలు అందుతాయన్నారు.



మాట్లాడుతున్న సురేఖ



మాట్లాడుతున్న నాగరాజు

ఈ కార్యక్రమంలో ఫైనాన్స్ సెక్రెటరీ రామక్రిష్ణ, స్పెషలాఫీసర్ అనిల్‌కుమార్, జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య, కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రాంరెడ్డి, జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షుడు పింగిలి వెంకట్రాం నర్సింహారెడ్డి, పంచాయతీ స్పెషలాఫీసర్ నాగవెల్లి శ్రీనివాస్, హౌసింగ్ నోడల్ ఆఫీసర్ రాజేందర్, తహసీల్దార్ చల్ల ప్రసాద్, ఎంపీడీవో కరుణాకర్‌రెడ్డి, ఏవో అనురాధ, ఏపీవో విజయలక్ష్మి, ఏపీఎం ప్రభాకర్, ఏఈవో శైలజ, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పోరెడ్డి మహేందర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు తంగెళ్లపల్లి తిరుపతి, పీఏసీఎస్ చైర్మన్ బిల్ల ఉదయ్‌రెడ్డి, వీసం సురేందర్‌రెడ్డి, మధన్, చిర్ర విజయ్‌తో పాటు వివిధ శాఖల అధికారులు, జిల్లా, మండల స్థాయి అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భద్రకాళి అమ్మవారి ఆలయంలో రథ సేవ

భక్తులకు అన్నప్రసాద వితరణ

వరంగల్ కల్చరల్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): చారిత్రక భద్రకాళి అమ్మవారి ఆలయంలో ఆదివారం సాయంత్రం రథ సేవ నిర్వహించారు. అమ్మవారు ఉత్సవమూర్తికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం భక్తుల జై కారాలతో ఆలయంలో రథ సేవను నిర్వహించారు.

అలాగే మహా మంగళహారతి, తీర్థ ప్రసాద వితరణ జరిగింది. ఆలయం వెలుపల భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. గణతంత్ర దినోత్సవం ఆదివారం కావడంతో ఉదయం నుంచి రాత్రి వరకు వేలాది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులతో ఆలయం కిటకిటలాడింది. రాత్రి అమ్మవారికి మహా హారతి పూజ నిర్వహించారు.

జనగామలో టెన్షన్.. టెన్షన్

- మంత్రి పొంగులేటి పర్యటన నేపథ్యంలో ఉద్రిక్తత
- కాంగ్రెస్, బీఆర్ఎస్ శ్రేణుల మధ్య ఘర్షణ
- ఆందోళన నేపథ్యంలో మంత్రి పర్యటన రద్దు



ఎమ్మెల్యే పల్లా, పోలీసుల మధ్య వాగ్వాదం

జనగామ, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): జనగామ మండలం ఎర్రకుంటతండాలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పర్యటన సందర్భంగా హై టెన్షన్ వాతావరణం ఏర్పడింది. సభా వేదిక వద్దే కాంగ్రెస్, బీఆర్ఎస్ శ్రేణుల మధ్య తీవ్ర ఘర్షణ నెలకొంది. రైతుభరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల పథకాల ప్రారంభ కార్యక్రమాన్ని ఎర్రకుంటతండాకు మధ్యాహ్నం 2.30గంటలకు రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆదివారం హాజరు కావాల్సి ఉంది. దీని కోసం అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. మంత్రి పర్యటన నేపథ్యంలో గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులను పోలీసులు ముందస్తు అరెస్టులు చేశారు. ఇదే కార్యక్రమంలో ఎమ్మెల్యే హోదాలో పల్లా రాజేశ్వర్‌రెడ్డి కూడా హాజరు అయ్యేందుకు సభా వేదిక వద్దకు వచ్చారు. ఈ క్రమంలో అక్కడే ఉన్న డీసీపీ రాజమహేంద్రనాయక్‌తో ముందస్తు అరెస్టులు చేసిన బీఆర్ఎస్ నాయకులను విడుదల చేయాల్సిందిగా కోరారు. ఇదే సమయంలో అక్కడే ఉన్న కాంగ్రెస్ శ్రేణులు ఎమ్మెల్యే పల్లాను చూసి పల్లా.. గోబ్యాక్ అంటూ నినాదాలు చేశారు. దీంతో కాంగ్రెస్, బీఆర్ఎస్ శ్రేణుల మధ్య తీవ్ర వాగ్వాదం, తోపులాట జరిగింది. ఇరు వర్గాలు కాంగ్రెస్ జిందాబాద్.. పల్లా గోబ్యాక్ అంటూ పోటాపోటీగా నినాదాలు అంతటితో ఆగకుండా సభలో ఉన్న కుర్చీలను విసిరేసుకున్నారు. గమనించిన పోలీసులు లాఠీలను ఝుళిపించారు. పోలీసులు లాఠీచార్జి చేయడంతో జనగామ మండలం వెంకిర్యాలకు చెందిన తాళ్లపల్లి అశోక్ చేతికి, గానుగుపహాడ్‌కు చెందిన గుర్రం కుమార్‌కు మోకాలికి గాయమైంది. ఆందోళన జరుగుతుండడంతో ధర్మసాగర్ పర్యటనలో ఉన్న మంత్రి పొంగులేటి ఎర్రకుంటతండా పర్యటనను రద్దు చేసుకున్నారు. ఇదే విషయాన్ని స్టేజీ మీద అధికారులు ప్రకటించారు. ఈ సమయంలో ఎమ్మెల్యే పల్లా మైక్ తీసుకొని మాట్లాడబోతుండగా కాంగ్రెస్ కార్యకర్తలు ఒక్కసారి నినాదాలు చేస్తూ పల్లా పైకి రాళ్లు, కోడిగుడ్లు విసిరారు. వెంటనే స్పందించిన పోలీసులు ఎమ్మెల్యే పల్లాను దూరంగా తీసుకొచ్చారు. కాంగ్రెస్ శ్రేణులు విసిరిన రాయి ఓ జర్నలిస్టుకు కంటికి తగిలింది. చికిత్స కోసం జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించారు. కాగా, గొడవ జరుగుతున్న విషయాన్ని తెలుసుకున్న డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి ఎర్రకుంటతండాకు వస్తున్నారని తెలియడంతో ఆందోళన మరింత పెరిగే అవకాశం ఉందని పోలీసులు భావించారు. దీంతో డీసీపీ రాజమహేంద్రనాయక్, ఏఎస్పీ చేతన్ నితిన్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డిని బలవంతంగా కారు ఎక్కించి జనగామకు తరలించారు. దీంతో ఉద్రిక్తత సద్దుమణిగింది. అనంతరం హడావుడిగా లబ్ధిదారులకు ప్రొసీడింగ్ పత్రాలను అందించి కార్యక్రమాన్ని ముగించారు.

భారీగా మోహరించిన పోలీసులు

మంత్రి పొంగులేటి పర్యటన నేపథ్యంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్య ఘర్షణ తలెత్తే అవకాశం ఉందని భావించిన పోలీసులు భారీగా బలగాలను మోహరించాయి. జనగామతో పాటు వెస్ట్‌జోన్ పరిధిలోని నర్మెట్ట, రఘునాథపల్లి, జనగామ పోలీస్ స్టేషన్ల నుంచి సీఐలు, ఎస్సైలు, కానిస్టేబుళ్లతో బందోబస్తు నిర్వహించారు. మంత్రి పర్యటన సందర్భంగా ముందస్తుగా బీఆర్ఎస్, బీఆర్ఎస్ శ్రేణులను పోలీసులు అరెస్ట్ చేశారు.



పల్లాను బలవంతంగా కారులో ఎక్కిస్తున్న పోలీసులు



లాఠీచార్జ్ చేస్తున్న పోలీసులు

నలిగిన వలస బతుకులు

- రెండు ఆటోలపై కంటైనర్‌లోని ఇనుప స్తంభాల బోల్తా
- మృతులంతా మధ్యప్రదేశ్ భోపాల్ వలస కార్మికులు
- ప్రమాద ఘటనపై సీఎం రేవంత్‌రెడ్డి దిగ్భ్రాంతి
- క్షతగాత్రులను పరామర్శించిన మంత్రి సురేఖ, కలెక్టర్, సీపీ

➡ కంటైనర్‌లోని స్తంభాలు మీదపడి నలుగురి మృత్యువాత ➡ వరంగల్, ఖమ్మం జాతీయ రహదారిపై ఘటన

మామునూరు, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంగాని రాష్ట్రం.. ప్రాంతం కాని ప్రాంతానికి పొట్టచేత పట్టుకుని బతుకుదెరువు కోసం వచ్చిన వారిపై ఓ కంటైనర్ లారీ మృత్యురూపంలో వచ్చిపడింది. కత్తులు, ఈలపీటలు తయారు చేసి విక్రయిస్తూ కడుపు నింపుకునేవారి జీవితాలు ఆ ప్రమాదంలో కడతేరాయి.. కుటుంబసమేతంగా వచ్చి జీవిస్తున్న వారి జీవితాలు ఒక్క నిమిషంలో ఒక్కసారిగా చిన్నాభిన్నమయ్యాయి. మద్యం మత్తులో వేగంగా భారీ కంటైనర్ లారీ నడుపుకుంటూ వచ్చిన డ్రైవర్.. రెండు ఆటోలను ఢీకొట్టి నలుగురు ప్రాణాలు బలిగొన్నాడు. వరంగల్ - ఖమ్మం జాతీయ రహదారిపై మామునూరు పోలీసుస్టేషన్ పక్కనున్న పెట్రోల్‌బంకు వద్ద ఆదివారం ఉదయం 10.30 గంటలకు ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో నలుగురు మధ్యప్రదేశ్‌కు చెందిన వలస కూలీలు మృతి చెందగా నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. మామునూరు పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..

మధ్యప్రదేశ్ భోపాల్ లలితానగర్ ప్రాంతానికి చెందిన లోపిట సంతోష్ చౌహాన్(48) అనే వ్యక్తి బతుకు దెరువు కోసం భార్య, ఇద్దరు కుమార్తెలు, ఇద్దరు కుమారులతో సహా వరంగల్ మామునూరు ప్రాంతానికి తొమ్మిది నెలల కిందట వచ్చారు. ఆయన కుటుంబంతో పాటు సుమారు ఆరు కుటుంబాలు కూడా ఇక్కడి వచ్చారు. వంటకు ఉపయోగించే కత్తులు, ఈలపీటలు తయారు చేసి వాటిని అమ్ముతూ జీవనం గడుపుతున్నారు. ఈ క్రమంలో వారు తయారు చేసిన కత్తులు, ఈలపీటలు వరంగల్ నగరంలో విక్రయిస్తుంటారు. ఈ క్రమంలో ఆదివారం కూడా ఒకే ఆటోలో వీరందరూ వరంగల్ వైపు వెళ్తున్నారు. కాగా, కరీమాబాద్ ఎస్ఆర్ఆర్ తోట ప్రాంతానికి చెందిన మరో ఆటోడ్రైవర్ రాపర్తి సాగర్ ఐనవోలు నుంచి వరంగల్ వైపు వేరే ఆటోలో వెళ్తున్నాడు. అదే సమయంలో విశాఖపట్టణం నుంచి నాగపూర్ వైపు విశాఖ ఉక్కు భారీ స్తంభాలు కలిగిన అధిక లోడుతో నాగపూర్‌కు చెందిన భారీ కంటైనర్ వాహనం వస్తోంది. మామునూరులోని పోలీస్‌స్టేషన్ పక్కనున్న పోలీసుపెట్రోల్ బంక్ దగ్గరికి రాగానే అధిక లోడుతో వెళ్తున్న 18 టైర్ల కంటైనర్ భారీ వాహనం అదుపుతప్పింది. పక్కనే ఉన్న రెండు ఆటోల మీద లారీలో ఉన్న ఇనుప స్తంభాలు మీద పడ్డాయి. ఈ ఘటనలో సంతోష్ చౌహాన్(48), ఆయన కుమార్తెలు ఆర్తి అలియాస్ పూజ చౌహాన్ (20), కిరణ్ చౌహాన్(12)లు అక్కడికక్కడే మృతిచెందగా... ఆయన చిన్న కుమారుడు కన్నా చౌహాన్(7) ఎంజీఎంలో చికిత్స పొందుతూ మృతిచెందారు. కాగా, భార్య చామ బాయి(40), పెద్దకుమారుడు ముఖేష్ చౌహాన్(20)లు తీవ్రంగా గాయపడ్డారు. వీరి ఆటో నడుపుతున్న పున్నేలు గ్రామానికి చెందిన ఆటోడ్రైవర్ మహ్మద్ షాకీర్‌కు తీవ్రగాయాలయ్యాయి. అలాగే వేరే ఆటోలో ఉన్న కరీమాబాద్ ఎస్ఆర్ఆర్ తోట ప్రాంతానికి చెందిన మరో ఆటోడ్రైవర్ రాపర్తి సాగర్ (45) గాయపడ్డారు. తీవ్రంగా గాయపడ్డ వారిని ఎంజీఎంకు తరలించారు.



కంటైనర్ లారీలోని స్తంభాలు మీద పడడంతో ఛిద్రమైన శరీరాలు

ఛిద్రమైన శరీరాలు

ఒకే కుటుంబానికి చెందిన వారిపై భారీ లోహపు స్తంభాలు పడటంతో సంఘటన జరిగిన స్థలంలో శరీర భాగాలు ఛిద్రమయ్యాయి. ఇనుప స్తంభాల కింద వలస కూలీలు మృతదేహాలు ఇరుక్కుపోవడంతో అక్కడి స్థానికులు ప్రమాదం జరిగిన తీరును చూసి చలించిపోయారు. బతుకు దెరువుకోసం కులవృత్తిని నమ్ముకుని పలు ప్రాంతాలు తిరుగుతూ జీవనం కొనసాగిస్తున్న వీరి కుటుంబం రోడ్డు ప్రమాదంలో మరణించడంతో మృతుల బంధువుల రోదనలు మిన్నంటాయి.

ఎంజీఎంలో మిన్నంటిన రోదనలు

నలుగురు వలస జీవులు మృత్యువాత పడటంతో ఎంజీఎం ఆస్పత్రిలో వారి సంబంధీకులు చేస్తున్న రోదనలు ప్రతీ ఒక్కరిని కంటతడి పెట్టించాయి. ఆస్పత్రికి వైద్యానికి వచ్చిన రోగుల బంధువులు మానవత్వంతో భోజనం అందించే ప్రయత్నం చేయగా.. నోట్లోకి ఏమీ పోవట్లేదని రోదించారు. మా సొంతూరుకి మమ్మల్ని పంపిస్తే వెళ్లిపోతామని రెండు చేతులు జోడించి అమాయకంగా విలపించారు. దీంతో అక్కడ ఉన్న ప్రతి ఒక్కరూ చలించిపోయారు.

సంఘటనా స్థలానికి కలెక్టర్, సీపీ

వరంగల్ - ఖమ్మం జాతీయ రహదారిపై జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో నలుగురు మృతి చెందగా ఐదుగురికి తీవ్రగాయాలయ్యాయి. కాగా, ప్రమాద ఘటనా స్థలాన్ని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్యశారద, వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా, మునిసిపల్ కమిషనర్ తానాజీ వాకడే, ఇతర పోలీసు అధికారులు సందర్శించారు. స్థానికులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రమాదానికి లారీ డ్రైవర్ నిర్లక్ష్యమే కారణమని అధికారులకు స్థానికులు తెలిపారు. కాగా ఈ ఘోర రోడ్డు ప్రమాదంలో ముఖేష్ చౌహాన్ ఫిర్యాదు మేరకు మామునూరు పోలీసులు కేసు నమోదు చేసి లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సీఐ ఓ.రమేష్ తెలిపారు.

మృతదేహాల తరలింపు

మామునూరు రోడ్డు ప్రమాద మృతులకు ఎంజీఎం మార్చురీలో వైద్యులు పోస్టుమార్టం పూర్తి చేశారు. ఆదివారం అయినా అధికారుల ఆదేశాలతో వైద్యులు పోస్టుమార్టం చేశారు. కాగా, సీపీ అంబర్‌కిషోర్ ఝా వాహనాలను సమకూర్చి మృతదేహాలను మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌కు తరలించారు. ప్రజాప్రతినిధులు, అధికారుల సహకారంతో మృతదేహాల తరలింపు జరిగింది.



నుజ్జునుజ్జు అయిన ఆటో



ప్రధాన రహదారిపై బోల్తా పడ్డ కంటైనర్ లారీ



మృతదేహాలను చాపలో తీసుకెళుతున్న పోలీసులు

సీఎం రేవంత్‌రెడ్డి దిగ్భ్రాంతి

వరంగల్ మామునూరులో జరిగిన ఘోర రోడ్డు ప్రమాద ఘటనపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతి చెందిన కుటుంబాలకు సానుభూతి తెలిపారు. ఈ ఘటనలో గాయపడ్డ వారిని తక్షణమే మెరుగైన వైద్యం అందించేందుకు వరంగల్ జిల్లా కలెక్టర్ సత్యశారద, పోలీసు అధికారులకు ఆదేశాలు జారీచేశారు. కాగా, ఎంజీఎంలో చికిత్స పొందుతున్న ప్రమాద బాధితులు ప్రైవేటు హస్పిటల్‌కు తరలించి మెరుగైన వైద్యం అందిస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

క్షతగాత్రులకు మంత్రి సురేఖ ఆర్థిక సాయం



క్షతగాత్రుల కుటుంబాలను పరామర్శిస్తున్న మంత్రి సురేఖ

వరంగల్ క్రైం, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం- వరంగల్ జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి ఎంజీఎంలో వేర్వేరు వార్డుల్లో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను మంత్రి సురేఖ పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు. పూర్తిగా కోలుకునేంతవరకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. డ్రైవర్ మద్యం తాగి లారీ నడపటం వలనే ప్రమాదం జరిగినట్లుగా అధికారులు ఈ సందర్భంగా మంత్రికి వివరించారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యాధికారులకు సూచించారు. మంత్రి వెంట వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు, కలెక్టర్ సత్యశారద, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, అదనపు కలెక్టర్ సంధ్యారాణి, తదితరులు పాల్గొన్నారు.

పంథని వద్దే ఆటోను ఢీకొట్టిన కంటైనర్

ఐనవోలు, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): మామునూరు వద్ద ప్రమాదానికి కారణమైన కంటైనర్ లారీ.. తొలుత పంథిని వద్ద ఓ ఆటోను ఢీకొట్టి వేగంగా వెళ్లింది. ఆదివారం ఉదయం పంథిని నల్లబర్రె బ్రిడ్జి వద్ద ఆటోను వెనుకనుంచి ఢీకొనడంతో ఆటో పడిపోయింది. ఈ ప్రమాదంలో కక్కిరాలపల్లికి చెందిన ఆటో డ్రైవర్ చిర్ర రాజుకు గాయాలు కాగా ఆస్పత్రికి తరలించారు. ప్రమాదం జరిగాక కంటైనర్ నిలపకుండా వరంగల్ వైపు వేగంగా వెళ్లింది. ఆటోడ్రైవర్ వెంబడిస్తాడనే భయంతో డ్రైవర్ అజాగ్రత్తగా, వేగంగా వెళ్లడంతో వాహనదారులు బెంబేలెత్తిపోయారు. డ్రైవర్ ప్రవర్తనను గమనించిన కొంత మంది 100కు ఫోన్ చేసి సమాచారం ఇచ్చేలోపే మామునూరు వద్ద ప్రమాదం జరిగిపోయిందని ప్రత్యక్ష సాక్షులు వాపోయారు.



ప్రమాదానికి గురైన ఆటో

ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు


పోలీసు గౌరవ వందనం స్వీకరిస్తున్న కలెక్టర్, ఎస్పీ

- ప్రగతి బాటలో ములుగు జిల్లా
- గణతంత్ర వేడుకల్లో కలెక్టర్ దివాకర
- జాతీయ పతాకం ఆవిష్కరణ
- ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర మంత్రి సీతక్క
- అలరించిన విద్యార్థుల నృత్య ప్రదర్శన
- వివిధ శాఖల ఆధ్వర్యంలో స్టాల్స్ ఏర్పాటు


మాట్లాడుతున్న కలెక్టర్


సాంస్కృతిక ప్రదర్శనలు చేస్తున్న విద్యార్థులు


మహనీయుల చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి సీతక్క

ములుగు కలెక్టరేట్, జనవరి 26(ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లాను ప్రతిగపథంలో నడిపిస్తున్నామని, అర్హులైన ప్రతి ఒక్కరికీ అభివృద్ధి, సంక్షేమ ఫలాలను అందించేందుకు కృషి చేస్తున్నామని కలెక్టర్ టి.ఎస్.దివాకర అన్నారు. గణతంత్ర వేడుకలు ఆదివారం ములుగులోని తంగేడు మైదానంలో ఘనంగా జరిగాయి. జాతీయ జెండాను కలెక్టర్ ఆవిష్క రించారు. ఎస్పీ శబరీశ్‌తో కలిసి ఓపెన్ టాప్ జీపుపై నుంచి ప్రజలకు అభివాదం చేశారు. పోలీసులు పరేడ్ నిర్వహించి గౌరవ వందనం సమర్పించారు. విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి సీతక్క హాజరయ్యారు. 237 మంది ఉత్తమ అధికారులు, ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. ఆయా శాఖల ఆధ్వర్యంలో స్టాల్స్ ఏర్పాటుచేయగా మంత్రి, కలెక్టర్ సందర్శించి ఉద్యోగులను అభినందించారు.

అభివృద్ధిలో ముందడుగు

అభివృద్ధి, సంక్షేమ పథకాలను సమర్థంగా అమలు చేస్తూ జిల్లాను ప్రగతిలో ముందుంచుతున్నామని కలెక్టర్ దివాకర అన్నారు. ఆరోగ్యశ్రీ పథకం ద్వారా 6123 మందికి రూ.13.69 కోట్ల విలువైన వైద్యాన్ని ఉచితంగా అందించామన్నారు. 3013 మంది గర్భిణులకు ప్రభుత్వ ఆస్పత్రులలో ప్రసవాలు జరిపించి రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిచామని తెలిపారు. ములుగు సామాజిక వైద్యశాలలో 14 స్పెషలిస్టు సేవలు అందిస్తున్నట్టు పేర్కొన్నారు. 50 మంది వైద్య విద్యార్థులతో ప్రభుత్వ వైద్య కళాశాల విజయవంతంగా నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఇప్పటివరకు 80 లక్షల మంది మహిళలు జిల్లాలో ఉచితంగా బస్సు ప్రయాణం చేశా రని తెలిపారు. ఏటూరునాగారంలో 6.28 కోట్లతో డిపో, ములుగులో 5.11కోట్లతో, మంగపేటలో 52 లక్షలతో బస్టాండ్లను నిర్మించుకోబోతున్నామని చెప్పారు. 26,811మంది రైతులకు రూ.219.97 కోట్ల పంట రుణాలను మాఫీ చేశామన్నారు. 1,33,681 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి రూ.237కోట్ల 2 లక్షల చెల్లింపులు చేశామని తెలిపారు. ఇప్పటి వరకు రూ.32 కోట్ల బోనస్ చెల్లించామన్నారు. 46,862 మంది మహిళలకు రూ.500కే గ్యాస్ సిలిండర్ అందజేస్తున్నామన్నారు. 39,711 గృహ వినియోగదారులకు 200 యూనిట్లలోపు విద్యుత్‌ను ఉచితంగా సరఫరా చేసినట్లు చెప్పారు. 26,230వ్యవసాయ కనెక్షన్‌లకు కూడా ఉచితంగా విద్యుత్‌ను సరఫరా చేస్తున్నామన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో 64,976 మంది కూలీలకు 15 లక్షల 82వేల పనిదినాలు కల్పించి రూ.36.52 కోట్లను కూలీగా చెల్లించామన్నారు. 5782 సంఘాలకు రూ.182.52 కోట్ల బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి కింద 342సంఘాలకు రూ.12.26 కోట్లు మంజూరు చేశామని తెలిపారు. 38,842 మంది పింఛన్ దారులకు ప్రతీనెలా పింఛన్ అందిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. 326 అంగన్‌వాడీ కేంద్రాలలకు ప్రీస్కూల్ ఫర్నిచర్‌ను అందించామన్నారు. 60 కేంద్రాలను కార్పొరేట్ స్థాయిలో అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. వెంకటాపూర్ మండలం పాలంపేటలో రూ.90 లక్షలతో ప్రభుత్వ వృద్ధాశ్రమాన్ని నిర్మిస్తున్నామన్నారు. మినీ మేడారం జాతర నిర్వహణ కోసం 10 శాఖలకు రూ.5.33 కోట్లను మంజూరు చేసినట్లు తెలిపారు. 200 మంది కల్లుగీత కార్మికులకు కాటమయ్య రక్షా కిట్లను అందించామన్నారు. 2024-25 సంవత్సరంలో 975 మంది లబ్ధిదారులకు రూ.9.76 కోట్ల కల్యాణలక్ష్మి, షాదీముబారక్ సాయాన్ని అందించినట్లు వివరించారు. పీఆర్, ఆర్అండ్‌బీ ఆధ్వర్యంలో పెద్దఎత్తున రోడ్లు, వంతెనలు, భవన నిర్మాణాలు చేస్తున్నామన్నారు. 239 పాఠశాలల్లో అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా రూ.6.91 కోట్లతో మౌలిక సౌకర్యాలు కల్పించామన్నారు. జిల్లా పొడవునా 370 సీసీ కెమెరాలు ఏర్పాటుచేసి శాంతి భద్రతలను నిరంతరం పర్యవేక్షిస్తున్నా మని, డ్రగ్స్ నిర్మూలనకు కృషి చేస్తున్నామన్నారు. ఈ వేడుకల్లో డీఎఫ్‌వో రాహుల్ కిషన్ జాదవ్, అదనపు కలెక్టర్‌లు మహేందర్‌జీ, సంపత్ రావు, ఓఎస్డీ గీతే మహేష్ బాబాసాహెబ్, ఏఎస్పీలు శివం ఉపాధ్యాయ, సదానందం, గ్రంథా లయ సంస్థ ఛైర్మన్ బానోతు రవిచం దర్, ఆర్డీవో వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.


జాతీయ పతాకానికి గౌరవ వందనం చేస్తున్న కలెక్టర్ దివాకర, ఎస్పీ శబరీశ్

నాలుగు పథకాలు..

పేదల సంబురాలు

- జిల్లాలో తొమ్మిది గ్రామాల్లో ప్రారంభం
- మంజూరు పత్రాలు అందజేసిన మంత్రి సీతక్క
- హర్షం వ్యక్తం చేసిన లబ్ధిదారులు

ములుగు, జనవరి 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టి నాలుగు పథకాలు ఆదివారం జిల్లాలో అమలులోకి వచ్చారు. గణతంత్ర దినోత్సవ వేళ ఆదివారం రాష్ట్ర మంత్రి ధనసరి అనసూయ సీతక్క లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేస్తూ పథకాలను ప్రారంభించారు. దశాబ్ద కాలంగా రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల కోసం ఎదురుచూస్తున్న నిరుపేదలు ప్రొసీడింగ్ కాపీలను అందజేశారు. సుదీర్ఘ నిరీక్షణకు తెరపడటంతో వారితోపాటు రైతు భరోసా, ఆత్మీయ భరోసా పథకాల లబ్ధిదారులూ హర్షం వ్యక్తంచేస్తున్నారు. అయితే తొలివిడతలో జిల్లాకు 3500 గృహాలు మంజూరుకాగా 17,688 దరఖాస్తులు వచ్చాయి. వీటిలో నిలువ నీడలేని నిరుపేదలను గుర్తించి ప్రాధాన్యతగా వారికి పథకాన్ని వర్తింపజేశారు. జిల్లాలోని 9 మండలాల్లో ఒక్కో గ్రామాన్ని ఎంపిక చేసి మొదటి రోజున లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందించారు. ములుగు మండలం జీవంతరావుపల్లి, వెంకటాపూర్ మండలం లింగాపూర్, గోవింద రావుపేట మండలం రాఘవపట్నం, తాడ్వాయి మండలం అంకంపల్లి, ఏటూరునాగారం మండలం ముల్లకట్ట, కన్నాయిగూడెం మండలం కంతనపల్లి, మంగపేట మండలం పూరేడుపల్లి, వెంకటాపురం మండలం రాచపల్లి, వాజేడు మండలం టేకులగూడెంలో అధికారులు ప్రత్యేక సభలు ఏర్పాటుచేసి పథకాలను ప్రారంభించారు.

కవర్ల కింద కాలం వెల్లదీస్తున్నా..

- అజ్మీరా లలిత, ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారు



భార్త మరణించిన తర్వాత పెద్దదిక్కు లేక పేదరికంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నా. ఇల్లు కూలిపోవడంతో పదేండ్లుగా మొండి గోడల మధ్యనే వెళ్లదీసిన. అది కూడా ధ్వంసం కావడంతో రెండేళ్ల నుంచి కవర్లతో గుడారం వేసుకొని బతుకుతున్నాం మంత్రి సీతక్క నాకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేశారు.. ఇక నా కష్టం తీరింది.

ఒకేసారి రెండు పథకాలు

- మాజమ్మ, ఇందిరమ్మ ఇల్లు, ఆత్మీయ భరోసా లబ్ధిదారు



వ్యవసాయ కూలీ పనులు, ఉపాధి పనులకు వెళ్తూ బతుకు తున్నాను. వర్షానికి గుడిసె కురుస్తోంది. పాములు, తేళ్లు లోపలికి వస్తున్నాయి. ప్రభుత్వం నాకు ఇందిరమ్మ ఇల్లుతోపాటు ఆత్మీయ భరోసా పథకాలను మంజూరు చేసింది. చాలా సంతోషంగా ఉంది.

12 ఏండ్ల తర్వాత రేషన్ కార్డు వచ్చింది


- ముకులోతు స్వాతి దంపతులు, రేషన్‌కార్డు లబ్ధిదారు



మా వివాహం జరిగిన 12 ఏండ్ల తర్వాత రేషన్‌కార్డు వచ్చింది. గత ప్రభుత్వంలో అనేకసార్లు దరఖాస్తులు ఇచ్చినా మంజూరు కాలేదు. ఇప్పుడు మాకు ఇద్దరు పిల్లలున్నారు. వారిద్దరిని నమోదు చేస్తూ కార్డు వచ్చింది.


మంత్రి సీతక్క చేతులమీదుగా ప్రశంసా పత్రం అందుకుంటున్న అదనపు కలెక్టర్ సంపత్‌రావు


చేరాలు ఎంపీవో




మోహన్‌లాల్ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్


కొమురయ్య జిల్లా పశుసంవర్థక శాఖ అధికారి


మల్లేషం, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్


శ్రీనివాస్, జిల్లా ఎక్సైజ్ అధికారి


వెంకటనారాయణ ఏపీడీ


పాణిని డీఈవో


మహేష్‌బాబు, కలెక్టరేట్ సూపరింటెండెంట్


దేవేందర్, ఈడీఎం


స్వామి సబార్డినేట్


పాషా సబార్డినేట్


అరవింద్ సీసీ


శైలెందర్ సీసీ


ఎన్‌అశోక్ ఆర్ఎస్ఐ


సమత డబ్ల్యూపీసీ


డి.ఘధురెడ్డి కానిస్టేబుల్


జాతీయ పతాకానికి వందనం చేస్తున్న జిల్లా జడ్జి

ఘనంగా గణతంత్ర వేడుకలు

భూపాలపల్లి కృష్ణకాలనీ, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి పోలీసు హెడ్‌క్వార్టర్స్‌లో గణతంత్ర వేడుకల సందర్భంగా ఎస్పీ కిరణ్ ఖరే జాతీయ జెండాను ఆవిష్కరించారు. మహాత్ముల చిత్ర పటాలకు పూలమాలు వేసి నివాళులు అర్పించారు. అదనపు ఎస్పీ బోనాల కిషన్, ఏఆర్ అదనపు ఎస్పీ వేముల శ్రీనివాస్, డీఎస్పీలు సంపత్‌రావు, రామ్మోహన్‌రెడ్డి, నారాయణ నాయక్‌లు పాల్గొన్నారు. పట్టణంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి జాతీయ జెండా ఆవిష్కరించారు. మునిసిపల్ చైర్ పర్సన్ సెగ్గం వెంకటరాణి, ముఖ్య నాయకులు, కార్యకర్తలు, బీఆర్ఎస్ కౌన్సిలర్ పాల్గొన్నారు. జిల్లా కేంద్రంలోని వివిధ ప్రభుత్వ కార్యాలయాల్లో 76వ గణతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. జిల్లా కోర్టు ఆవరణలో జిల్లా జడ్జి నారాయణబాబు, ఎక్సైజ్ సూపరింటెండెంట్ కార్యాలయంలో సూపరిండెంట్ శ్రీనివాస్, డీఎస్పీ కార్యాలయంలో డీఎస్పీ సంపత్‌రావు, పోలీస్‌స్టేషన్‌లో సీఐ నరేష్‌కుమార్, ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో రవి, జడ్పీ కార్యాలయంలో జడ్పీ సీఈవో, ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ విజయలక్ష్మి తహసీల్దార్ శ్రీనివాసులు, ఆర్టీవో కార్యాలయంలో రవాణాశాఖ అధికారి సమ్మానీ, జాతీయ పతాకాల్ని ఎగురవేశారు.

- ఏటూరునాగారం : గణతంత్ర దినోత్సవ వేడుకలు మండ లంలో ఘనంగా జరిగాయి ఆయా కార్యాలయాల్లో ఏఎస్పీ శివం ఉపాధ్యాయ, ఎంపీడీవో రాజ్యలక్ష్మి, తహసీల్దార్ గుర్రం జగదీశ్వర్, జడ్పీఎస్ఎస్ పాఠశాలలో ఎంఈవో కొయ్యగ మల్లయ్య, సీడీపీవో ప్రేమలత, జీసీసీ కార్యాలయంలో ప్రతాప రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చిటమట రఘు, బీఆర్ఎస్ మండల కార్యాలయంలో మండల అధ్యక్షుడు గడదాసు సునీల్ కుమార్ జాతీయ జెండాను ఎగురవేశారు.
- గోవిందరావుపేట (ఆంధ్రజ్యోతి): మండలంలోని చల్వాయిలో గల 5వ తెలంగాణ స్పెషల్ పోలీస్ బెటాలియన్‌లో గణతంత్ర వేడుకలు ఘనంగా జరిగాయి. ఇన్‌చార్జి కమాండెంట్ కె.సుబ్రహ్మణ్యం జాతీయ పతాకాన్ని ఎగురవేసి గౌరవ వందనం స్వీకరించారు. ఈసందర్భంగా అధికారుల సేవను గుర్తించి ప్రభుత్వం అందజేసిన అతి ఉతకృష్ట సేవాపథకం ఆర్ఐ శ్రీనివాసులు, ఆర్ఎస్సై బాబుల్‌రెడ్డి, ఉతకృష్ట సేవా పథకాన్ని ఆర్ఐ జి.కార్తీక్‌లకు అంద జేశారు. అసిస్టెంట్ కమాండెంట్ అనిల్‌కుమార్, రిజర్వు ఇన్‌స్పెక్టర్‌లు కార్తీక్, శ్రీనివాసులు, అన్నయ్య, రాంప్రసాద్, ఇతర బెటాలియన్ సిబ్బంది పాల్గొన్నారు. మండల కేంద్రంలోని ఇందిరాగాంధీ విగ్రహం వద్ద రామచంద్రపు వెంకటేశ్వర్‌రావు ఆధ్వర్యంలో జరిగిన గణతంత్ర వేడుకల్లో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పాలడుగు వెంకటకృష్ణ, తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ సృజన్, ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో జవహర్‌రెడ్డి, పస్రా పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై కమలాకర్ జెండాను ఎగురవేశారు.
- తాడ్వాయి : మండల వ్యాప్తంగా గణతంత్ర దినోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ప్రభుత్వ కార్యలయాలు, పాఠశాలలు, ప్రైవేటు సంస్థలు, యువజన సంఘాల కార్యాలయాలు, ఆరోగ్య కేంద్రాల్లో జాతీయ జెండాను ఎగురవేశారు.
- మంగపేట (ఆంధ్రజ్యోతి): మండలంలో జరిగిన గణతంత్ర వేడుకల్లో తహసీల్దార్ టి.రవీందర్, ఎంపీడీవో బి.భద్రు, ఎస్సై సూరి, ప్రత్యేక అధికారి ఆలేటి సుదర్శన్, ఫారెస్టు రేంజర్ బాలు, వైద్యాధికారిణి అఖిల, పశు వైద్యాశాలలో వైద్యాధికారి రజిత, వర్తక మండలి అధ్యక్షుడు కె కేశవరావు తదితరులు జాతీయ జెండాను ఎగురవేశారు.


భూపాలపల్లిలో జెండా ఆవిష్కరిస్తున్న ఎస్పీ కిరణ్‌ఖరే

- వాజేడు (ఆంధ్రజ్యోతి): మండలలంలో జరిగిన వేడుకల్లో తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో విజయ, ఎంఈవో వెంకటేశ్వర్లు, డాక్టర్లు మహేందర్, రాహీల్, ఐటీఐ ప్రిన్సిపాల్ శేఖర్, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ విజయకుమార్, పీఏసీఎస్ ఛైర్మన్ ఎగ్గడి అంజయ్య, వాజేడు ఎస్సై రాజ్‌కుమార్, పేరూరు ఎస్సై గుర్రం కృష్ణప్రసాద్ జాతీయ జెండాను ఆవిష్కరించారు.
- వెంకటాపురం (ఆంధ్రజ్యోతి): మండలంలో జరిగిన గణతంత్ర వేడుకల్లో తహసీల్దార్ లక్ష్మీరాజయ్య, ఎంపీడీవో రాజేంద్రప్రసాద్, సొసైటీ సెక్రటరీ సత్యనారాయణ, ఐసీడీఎస్ సీడీపీవో ముత్తమ్మ, మేజర్ పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సయ్యద్ హుస్సేన్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గంపా రాంబాబు, సొసైటీ అధ్యక్షుడు చిడెం మోహన్‌రావు, నాయకులు గార్లపాటి రవి, పిల్లారిశెట్టి మురళి, మన్నెం సునీల్, చిడెం శివ, తదితరులు పాల్గొన్నారు.
- వెంకటాపూర్ (ఆంధ్రజ్యోతి): మండలంలో జరిగిన గణతంత్ర వేడుకల్లో తహసీల్దార్ గిరిబాబు, ఎంపీడీవో మూడ్ రాజునాయక్, ఎంఈవో ప్రభాకర్, ఎస్సై జక్కుల సతీష్, ప్రాథమిక ఆరోగ్యకేంద్రం డాక్టర్ శ్రీకాంత్, తెలంగాణ గ్రామీణ బ్యాంకులో మేనేజర్ సుమన్ జెండాను ఆవిష్కరించారు.

భూపాలపల్లిటౌన్ (ఆంధ్రజ్యోతి): గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు తన క్యాంపు కార్యాలయంలో జాతీయ జెండాను ఆవిష్కరించారు. నాయకులు చల్లూరి మధు, బుర్ర కొంరయ్య, ముంజాల రవీందర్, పిప్పాల రాజేందర్, సాంబమూర్తి, శ్రీనివాస్, రంజిత్ తదితరులు పాల్గొన్నారు. మునిసిపల్ కార్యాలయంలో కమి షనర్ రాజేశ్వర్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. విద్యుత్ శాఖ కార్యాలయంలో ఎస్ఈ మల్హూర్ జాండాను ఆవిష్కరించారు.

- గణపురం (ఆంధ్రజ్యోతి): మండలంలో గణతంత్ర వేడుకలు ఘనంగా జరిగాయి. తహసీల్దార్ సత్యనారాయణ, ఎస్సై అశోక్, ఎంపీడీవో భాస్కర్, పీఏసీఎస్ కేంద్రంలో కన్నెబోయిన కుమార్, గండ్ర సత్యనారాయణరెడ్డి, కేటీపీపీలో చీఫ్ ఇంజనీర్ శ్రీప్రకాశ్ జాతీయ జెండాను ఆవిష్కరించారు.
- టేకుమట్ల (ఆంధ్రజ్యోతి): మండలంలో జరిగిన వేడుకల్లో తహశీల్దార్ విజయలక్ష్మి, ఎంపీడీవో అనిత, ఎస్సై సుధాకర్ జాతీయ జెండాను ఆవిష్కరించారు.
- కాకతీయఖని (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లిలోని సింగరేణి జీఎం కార్యాలయంలో జనరల్ మేనేజర్ రాజేశ్వర్‌రెడి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అధికారులు కవీంద్ర, వెంకట్రామిరెడ్డి, మారుతి, తదితరులు పాల్గొన్నారు. జిల్లా అటవీశాఖ కార్యాలయంలో సీసీఎఫ్(కాంప) సువర్ణ జాతీయ పతాకాన్ని ఎగురవేశారు.సీసీఎఫ్ ప్రభాకర్, డీఎఫ్‌వో నవీన్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు. ఆర్టీసీ డిపోలో మేనేజర్ ఇందు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.
- రేగొండ (ఆంధ్రజ్యోతి) : రేగొండ, కొత్తపల్లిగోరి మండలాల వ్యాప్తంగా గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. రేగొండ తహసీల్దార్ శ్వేతారావు, ఎంపీడీవో వెంకటేశ్వరరావు, ఎస్సై సందీప్‌కుమార్, పీఏసీఎస్ ఛైర్మన్ విజ్ఞన్‌రావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అంకం రాజేందర్ జాతీయ జెండాను ఆవిష్కరించారు.
- కాటారం (ఆంధ్రజ్యోతి): మండలంలో జరిగిన గణతంత్ర వేడుకల్లో సబ్ కలెక్టర్ మయాంక్‌సింగ్, డీఎస్పీ గడ్డం రామోహన్ రెడ్డి, ఎంపీడీవో బాబు,తహసీల్దార్ నాగరాజు, ఎక్సైజ్ ఎస్సై కిష్టయ్య, పీఏసీఎస్ ఛైర్మన్ తోటపల్లి ప్రశాంత్, ఏఎంసీ కార్యదర్శి లా షరీఫ్, ఏపీఎం లవకుమార్, ఏవో పూర్ణిమ, పీహెచ్‌సీ డాక్టర్ మౌనిక, కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ నాయకులు వేమునూరి ప్రభాకర్‌రెడ్డి, పాగె రంజిత్, జోడు శ్రీనివాస్, రామిళ్ల కిరణ్, శ్రీపాద ట్రస్ట్ ఛైర్మన్ దుద్దిళ్ల శ్రీనుబాబు, సీఐ నాగార్జునరావు, ఎస్సై అభినవ్, ఎంపీవో వీరస్వామి, డీటీ రామ్మోహన్, ఆర్ఐ వెంకన్న, పీఏసీఎస్ సీఈవో సతీష్, జాతీయ జెండాను ఆవిష్కరించారు.
- మహదేవపూర్ రూరల్ (ఆంధ్రజ్యోతి) : పలిమెల, మహదేవపూర్ మండలాల వ్యాప్తంగా గణతంత్ర వేడుకలు ఘనంగా జరిగాయి. పీఏసీఎస్, ఎంపీడీవో, తహశీల్దార్ కార్యాలయాలతో పాటు వివిధ వ్యాపార, వాణిజ్య సంస్థలు జాతీయ జెండాను ఆవిష్కరించారు.
- మొగుళ్లపల్లి (ఆంధ్రజ్యోతి): మండలం జరిగిన వేడుకల్లో తహసీల్దార్ సునీత, ఎంపీడీవో హుస్సేన్, పీహెచ్‌సీ డాక్టర్ నాగరాణి, ఎస్సై బి.అశోక్, పీఏసీఎస్ ఛైర్మన్ నర్సింగరావు జాతీయ జెండాను ఎగురవేశారు.
- మల్హర్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలో జరిగిన గణతంత్ర వేడుకల్లో మండల ప్రత్యేకాధికారి అవినాష్, ఎంపీడీవో శ్యామ్‌సుందర్, తహసీల్దార్ రవికుమార్, పీఏసీఎస్ ఛైర్మెన్ మొండయ్య, వైద్యాధికారి వినయ్‌బాస్కర్, తాడిచర్ల ఓసీ వైస్ ప్రెసిడెంట్ ప్రభాకర్‌రెడ్డి, కొయ్యూర్ ఎస్సై నరేష్, ఐకేపీలో ఏపీఎం కమల జెండాను ఆవిష్కరించారు.
- మహాముత్తారం (ఆంధ్రజ్యోతి): మండలంలో జరిగిన గణతంత్ర వేడుల్లో తహసిల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో ఎం.శ్రీనివాసరావు, ఎస్సై మహేంద్రకుమార్, సెర్ప్ ఏపీఎం మాధవి, ఈజీఎస్ ఏపీఎం కుమారస్వామి, పీఏపీఎస్ ఛైర్మన్ సోమ శాంతకుమార్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వక్కల సడవలి, బీజేపి మండల అధ్యక్షుడు పూర్ణచందర్ జాతీయ జెండాను ఆవిష్కరించారు.
- ములుగు (ఆంధ్రజ్యోతి): గణతంత్ర వేడుకలు ఘనంగా జరిగాయి. జిల్లా కోర్టు ఆవరణలో జడ్జి సూర్యచంద్రకళ జాతీయ జెండాను ఆవిష్కరించారు. సీనియర్ సివిల్ జడ్జి కన్నయ్యలాల్, అదనపు జూనియర్ సివిల్ జడ్జి సౌఖ్య, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.వినయ్‌కుమార్‌యాదవ్, న్యాయవాదులు పాల్గొన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ శబరీశ్ జాతీయ జెండాను ఎగురవేశారు. బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో అధ్యక్షుడు లక్ష్మీనర్సింహరావు, బీజేపీ కార్యాలయంలో సిరికొండ బలరాం, ఆయా ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలలో అధికారులు, కార్మిక, విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో జెండాలను ఎగురవేశారు.

లబ్ధిదారులకు నాలుగు పథకాల పత్రాల అందజేత

భూపాలపల్లి కృష్ణకాలనీ, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి మండలంలోని రాంపూర్ గ్రామంలో నాలుగు పథకాలకు సంబంధించి మంజూరు పత్రాలను కలెక్టర్ రాహుల్‌శర్మ, రాష్ట్ర ట్రేడ్ కార్పొరేషన్ ఛైర్మన్ అయిత ప్రకాష్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ పంపిణీ చేశారు. జిల్లా పంచాయతీ అధికారి నారాయణరావు, తహసీ ల్దార్ శ్రీనివాసులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

- రేగొండ (ఆంధ్రజ్యోతి) : రేగొండ, కొత్తపల్లిగోరి మండలాలలోని లింగాల, రామగుండాలపల్లి గ్రామాల్లో నాలుగు సంక్షేమ పథకాల ప్రారంభో త్సవంలో కలెక్టర్ రాహుల్‌శర్మతో కలిసి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు మంజూరు పత్రాలు పంపిణీ చేశారు. మండల ప్రత్యేకాధికారి సునీల్, డీటీ రజాక్, ఆర్ఐ నరేష్, మార్కెట్ కమిటీ ఛైర్మన్ కిష్టన్న పాల్గొన్నారు.
- గణపురం (ఆంధ్రజ్యోతి):మండలంలోని బుర్రకాయలగూడెంలో నాలుగు పథకాల లబ్ధిదారులకు మంజూరు పత్రాలను ఎమ్మెల్యే గండ్ర, కలెక్టర్ రాహుల్‌శర్మ పంపిణీ చేశారు. తహసీల్దార్ సత్యనారా యణస్వామి, ఎంపీడీవో భాస్కర్, సింగిల్‌విండో ఛైర్మన్ కుమార్‌యాదవ్, భూపాలపల్లి మార్కెట్ కమిటీ వైస్ ప్రెసిడెంట్ రాజేందర్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.
- మొగుళ్లపల్లి (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంకుషాపురంలో నాలుగు పథకాల మంజూరు పత్రాలను ఎమ్మెల్యే సత్యనారాయణరావు పంపిణీ చేశారు. మండల ప్రత్యేక అధికారి సునీత, తహసీల్దార్ సునీత, ఎంపీడీవో హుస్సేన్, ఏఎంసీ ఛైర్మన్ శ్రీదేవి, వైస్ ఛైర్మన్ ఎమ్డీ.రఫి, పీఏసీఎస్ ఛైర్మన్ నర్సింగరావు, వైస్‌ఛైర్మన్ శ్రీనివాస్, మండల వ్యవసాయ అధికారి సురేందర్‌రెడ్డి, ఆర్ఐ సురేందర్‌రెడ్డితోపాటు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.
- టేకుమట్ల (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో నాలుగు పత్రాల మంజూరు పత్రాలను ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు పంపిణీ చేశారు. ప్రత్యేకాధికారి శైలజ, ఎంపీడీవో అనిత, తహసీల్దార్ విజయలక్ష్మి, వ్యవసాయ అధికారి మంజుల పాల్గొన్నారు.
- కాటారం (ఆంధ్రజ్యోతి): మండలంలోని ధన్వాడ గ్రామపంచాయతీ పరిధిలో ప్రజాపాలన పథకాల ప్రాంభోత్సవ కార్యక్రమంలో కాటారం సబ్ కలెక్టర్ మయాంక్‌సింగ్, డీఆర్డీవో నరేష్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. లబ్ధిదారులకు మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. తహసీల్దార్ నాగరాజు, ఎంపీడీవో బాబు, ఎస్సై అభినవ్, మాజీ ఎంపీపీ పంతకాని సమ్మయ్య, ఎంపీవో వీరస్వామి, ఏవో పూర్ణిమ, డీటీ రామ్మోహన్, ఆర్ఐ వెంకటయ్య, ఏపీవో వెంకన్న, కార్యదర్శులు ఉమాదేవి, సమీర్‌ఖాన్, శ్రీనివాస్, కర్ణాకర్, నాగరాజు, వంశీ, సాయి, రాజశేఖర్, సురేష్, దేవేందర్, ఏఈవోలు రాజన్న, సరిత, దీపక్, రెవెన్యూ సిబ్బంది రమ, సతీష్ తదితరులు పాల్గొన్నారు.
- మహాముత్తారం (ఆంధ్రజ్యోతి) మండలంలోని మాదారం గ్రామంలో నాలుగు పథకాల మంజూరు పత్రాలను అధికారులు పంపిణీ చేశారు. మండల ప్రత్యేకాధికారి వెంకటేశ్వర్లు, తహసిల్దార్ డి.శ్రీనివాస్, ఎంపీడీవో ఎం. శ్రీనివాసరావు, ఏవో అనుషా, ఏపీవో కుమరస్వామి, డీటీ సందీప్, ఆర్ఐ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

భార్య కాపురానికి రావడంలేదని భర్త ఆత్మహత్య


రంజిత్ (ఫైల్)

ఏటూరునాగారం, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): భార్య కాపురానికి రావడం లేదని భర్త ఆత్మహ త్య చేసుకున్న సంఘటన మండల కేంద్రంలోని ఆకులవారిఘణపురంలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్సై తాజుద్దీన్ తెలిపిన కథనం ప్రకారం.. ఏటూరునాగారం మండల కేంద్రంలోని ఆకులవారిఘణపురానికి చెందిన గంజి రంజిత్ (32) భార్య కాపురానికి రావడంలేదని మనస్తాపం చెందాడు. ఆదివారం ఇంటిలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య స్వాతి గత 15 రోజుల క్రితం భర్త అయిన రంజిత్‌తో గొడవపడి ఏటూరునాగారం నుంచి పినపాక ఆయిన తల్లిగారింటికి వెళ్లిపోయింది. ఎంతకీ కాపురానికి రాకపోవడంతో రంజిత్ ఉరివేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

వాజేడు, జనవరి 26(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న వ్యక్తి మృతిచెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. వాజేడు ఎస్సై రాజ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. వెంకటాపురం మండలం బర్లగూడెం గ్రామానికి చెందిన తాటి కుటుంబరావు(57) శనివారం రాత్రి మండలంలోని మురుమూరులో ఉన్న తన పొలం వద్దకు వెళ్లి ఇంటికి తిరిగి వెళ్తుండా ప్రగళ్లపల్లి శివారులో ప్రమాదం జరిగింది. వెంకటాపురం వైపు వెళ్తున్న వెంకటాపురం మండలం ఉప్పేడుకు చెందిన దుర్గం అప్పారావు ద్విచక్రవాహనం కుటుంబరావు వాహనాన్ని ఢీకొట్టింది. దీంతో కుటుంబరావుకు తీవ్రగాయాలు వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. చికిత్స అందిస్తున్న క్రమంలోనే పరిస్థితి విషమించి కుటుంబ రావు ఆదివారం రాత్రి మృతిచెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు.